

నేటి దర్శిని తెలుగు దిన పత్రిక లో
ప్రకటనల కోసం సంప్రదించగలరు.
సెల్ : 94920 33365



WWW.NETIDARSHINI.COM

# నేటి దర్శిని

RNI NO: TGTEL/25/A0471

తెలుగు దిన పత్రిక

సత్య శోధనే మా లక్ష్యం...

రంగారెడ్డి సోమవారం 18-05-2026 సంపుటి: 02 సంచిక : 17 వెల: 2 రూ పేజీలు :08 సంపాదకులు: కట్ల హిమ పావని

Ranga Reddy Monday, 18-05-2026 Volume :02 Issue: 17 RS: 2 Pages:08 Editor : Katta HimaPavani



రిపోర్టర్లు కావలెను

జర్నలిజంలో ఆసక్తి ఉన్నవారికి నేటి దర్శిని ఆహ్వానం పలుకుతుంది.
తెలుగు రాష్ట్రాలలో జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయిల్లో రిపోర్టర్లుగా పని చేయుటకు ఆసక్తి, అనుభవం ఉన్నవారు ఈ క్రింది నంబర్లకు కాల్ చేసి సంప్రదించగలరు.

Contact Number 9059328777


# రైతు కన్నీళ్లకు కారణం ఎవరు.?



## ధాన్యం కొనుగోళ్లలో దళారుల దందా


- పండించడానికి నాలుగు నెలలు.. అమ్మడానికి మూడు నెలలు
- దళారులు అవినీతి అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్
- రైతు ఆత్మహత్యలకు ప్రభుత్వాలే బాధ్యత వహించాలి
- తెలంగాణ రక్షణ సేన రాష్ట్ర నాయకులు కందాడి మణిపాల్ రెడ్డి కీలక వ్యాఖ్యలు..





**ఆలేరు,మే17 (నేటి దర్శిని):**
తెలంగాణ రాష్ట్రంలో రైతుల పరిస్థితి రోజురోజుకు దయనీయంగా మారుతోందని తెలంగాణ రక్షణ సేన రాష్ట్ర నాయకులు కందాడి మణిపాల్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. రైతు కష్టపడి పండించిన ధాన్యానికి సరైన ధర లేకపోవడం, కొనుగోలు కేంద్రాల్లో ఆలస్యం, దళారుల దందా కారణంగా అన్నదాతలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన ఆరోపించారు. "రైతు నాలుగు నెలలు రేయింబవళ్లు శ్రమించి పంట పండిస్తే, అమ్ముకునేందుకు మరో మూడు నెలలు నిరీక్షించాల్సిన పరిస్థితి ఏర్పడింది. రెక్కలు ముక్కలు చేసుకుని పంట పండించిన రైతుకు న్యాయం చేసే వారు లేకపోవడం దురదృష్టకరం" అని మణిపాల్ రెడ్డి పేర్కొన్నారు. ధాన్యం కొనుగోళ్లలో దళారుల ఆధిపత్యం పెరిగిపోయిందని ఆయన విమర్శించారు. ప్రభుత్వం క్వింటాల్ ధాన్యాన్ని రూ.2,300లకు కొనుగోలు చేస్తున్నప్పటికీ, అత్యవసర అవసరాల కోసం రైతులు దళారులకు రూ.1,700కే అమ్ముకోవాల్సిన పరిస్థితి

-మిగతా 2 లో




# ఎబోలా వైరస్ కలకలం

## కాంగోలో 88 మంది మృతి

- ఆఫ్రికా దేశం కాంగోలో మరోసారి కలకలం
- ఈ రకం వైరస్‌కు టీకా అందుబాటులో లేదని అధికారులు హెచ్చరిక
- హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించిన డబ్ల్యూహెచ్ఓ
- మరణాల శాతం ఎక్కువ : వైద్య అధికారులు

**కాంగో:మే17 (నేటి దర్శిని):**
ప్రాణాంతక ఎబోలా వైరస్ ఆఫ్రికా దేశం కాంగోలో మరోసారి కలకలం రేపుతున్న నేపథ్యంలో ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) కీలక నిర్ణయం తీసుకుంది. ఈ ఆరోగ్య సంక్షోభాన్ని అంతర్జాతీయ ఆరోగ్య అత్యవసర పరిస్థితిగా ఆదివారం ప్రకటించింది. ఈ రకం వైరస్‌కు టీకా అందుబాటులో లేదని అధికారులు హెచ్చరించిన నేపథ్యంలో ప్రపంచ ఆరోగ్య సంస్థ ఈ నిర్ణయం తీసుకుంది.కాగా, అత్యంత వేగంగా వ్యాపించే ఎబోలా వైరస్

-మిగతా 2 లో




## ఒప్పందానికి రాకపోతే
# బ్యాడ్ టైమే

- ది తుఫాన్ ముందు ప్రశాంతత..
- ఇరాన్‌కు ట్రంప్ తాజా హెచ్చరిక
- యుద్ధం ముగింపునకు 5 షరతులు

**వాషింగ్టన్,**
ఇరాన్‌కు చాలా క్లిష్టతరమైన సమయం రాబోతున్నదని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్ర హెచ్చరిక జారీ చేశారు. ఇరాన్‌పై అమెరికా దాడులను పునరుద్ధరిస్తుందని వస్తున్న వార్తల నేపథ్యంలో యూఎస్ నేవీ అడ్మిరల్‌తో కలిసి ఉన్న ఒక ఏఐ చిత్రాన్ని ఆయన సామాజిక మాధ్యమంలో షేర్ చేశారు. తుఫాన్‌తో అల్లకల్లోలంగా ఉన్న సముద్రంలో కొన్ని ఓడలు ఉన్న బ్యాక్‌గ్రౌండ్‌తో వీరిద్దరూ ఉన్నారు. ఆ చిత్రంలో ట్రంప్ కుడిచేయి పైకెత్తి చూపుడువేలుతో చూపిస్తూ హెచ్చరిస్తున్నారు. ఈ చిత్రంలో ఇస్లామిక్ రిపబ్లిక్ ఆఫ్ ఇరాన్ జెండాను ఎగురవేస్తున్న దృశ్యం కన్పిస్తున్నది. అలాగే చిత్రంపై 'తుఫాన్‌కు ముందు ఉండే ప్రశాంతత ఇది' అని క్యాప్షన్ పెట్టారు. కాగా, శాంతి ఒప్పందం కుదుర్చుకోకపోతే ఇరాన్ చాలా దుర్భరమైన పరిస్థితులను ఎదుర్కోవాల్సి ఉంటుందని ట్రంప్ మరోసారి హెచ్చరించారు. ఫ్రెంచ్ బ్రాడ్‌కాస్టర్ బీఎఫ్‌ఎంటీవీతో టెలిఫోన్ ఇంటర్వ్యూలో ట్రంప్ మాట్లాడుతూ త్వరలో శాంతి ఒప్పందానికి కనుక రాకపోతే ఈసారి ఇరాన్ అతి చెడ్డ సమయాన్ని

-మిగతా 2 లో



## ఆ ఆరు రోజులు తెలుగు రాష్ట్రాల్లో
# నిప్పుల వర్షమే!

- తెలుగు రాష్ట్రాలకు వాతావరణ శాఖ తీవ్ర హెచ్చరిక
- మే 19 నుంచి 24 వరకు అత్యంత తీవ్రంగా వడగాలులు
- 45 డిగ్రీలు దాటి రికార్డు స్థాయి ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం
- ఉదయం 10:30 నుంచి సాయంత్రం 4 గంటల వరకు బయటకు వెళ్లవద్దని సూచన
- వృద్ధులు, చిన్నారులు, గర్భిణీలు, రోగులు మరింత అప్రమత్తంగా ఉండాలని సలహా

**హైదరాబాద్ మే17 (నేటి దర్శిని):**
ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో ఎండలు దంచికొట్టనున్నాయి. రానున్న వారం రోజుల పాటు ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ తీవ్ర హెచ్చరికలు జారీ చేసింది. ముఖ్యంగా మే 19 నుంచి 24వ తేదీ వరకు ఆరు రోజుల పాటు భానుడి ప్రతాపం చుక్కలు చూపించనుందని, బలమైన వడగాలులు వీచే అవకాశం ఉందని తెలిపింది. ఈ రోజుల్లో పలు ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు 45 డిగ్రీల మార్కును దాటి రికార్డు స్థాయిలో నమోదయ్యే ప్రమాదం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. వాతావరణ శాఖ నివేదికల ప్రకారం, ఈ ఆరు రోజుల్లో వడగాల్పుల ప్రభావం అత్యంత తీవ్రంగా ఉండనుంది. దీనివల్ల వడదెబ్బ తగిలి ప్రాణాలకు ముప్పు వాటిల్లే ప్రమాదం

-మిగతా 2 లో

## గురుకులాలు, వసతి గృహ పాఠశాలలకు
# 'భవన అద్దె'

### 'డైట్' మరియు 'కాస్మెటిక్స్' నిధుల విడుదల

- నాణ్యమైన విద్యా వాతావరణాన్ని అందించడమే లక్ష్యంగా ఈ అడుగు
- మెరుగైన నివాస సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉంది.
- సమాజానికి ఉపయోగపడే బాధ్యతాయుత పౌరులుగా తీర్చిదిద్దడమే మా ప్రభుత్వ లక్ష్యం'
- నెలవారీ చెల్లింపుల విధానం అమలు



రూ. 221.24 కోట్లు మంజూరు చేసిన ప్రభుత్వం

**హైదరాబాద్ మే17 (నేటి దర్శిని):**
రాష్ట్రంలోని గురుకులాలు, ప్రభుత్వ వసతి గృహ పాఠశాలల నిర్వహణకు ఎదురవుతున్న ఆర్థిక ఇబ్బందులకు శాశ్వత పరిష్కారం లభించింది. షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలు, వెనుకబడిన తరగతులు, మైనారిటీ సంక్షేమం మరియు విద్యా శాఖల పరిధిలోని నివాస విద్యాసంస్థలకు సంబంధించిన ఆహార వ్యయాలు (డైట్ ఛార్జీలు), కాస్మెటిక్స్ ఖర్చులు, భవన అద్దెలను ఇకపై ప్రతి నెలా సకాలంలో విడుదల చేయాలని ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. సామాజికంగా వెనుకబడిన, బలహీన వర్గాల విద్యార్థులకు మెరుగైన వసతులు, నాణ్యమైన విద్యా వాతావరణాన్ని అందించడమే లక్ష్యంగా ఈ అడుగు వేసింది. గతంలో ఈ నిధుల చెల్లింపుల్లో 8 నుంచి 9 నెలల వరకు ఆలస్యం కావడం వల్ల నివాస పాఠశాలలు, హాస్టళ్ల నిర్వహణలో తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యేవి.

-మిగతా 2 లో

# శంకుస్థాపనకు రండి..

- సీఎం రేవంత్ కు యాదాద్రి అర్చకులు, అధికారుల ఆహ్వానం
- సరస్వతీ అంత్య పుష్కరాలకు సైతం ఇన్విటేషన్ అందజేత



2 లో

# నేటి నుంచే 'పర్యాటక వారోత్సవాలు'



- పర్యాటక సొగసుల 'తెలంగాణ'గా నిర్వహణ
- 'ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక'తో పర్యాటక రంగానికి సరికొత్త కళ
- పలు కార్యక్రమాల్లో పాల్గొననున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

**హైదరాబాద్**
తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, చారిత్రక వారసత్వ సంపదను, పర్యాటక శోభను ప్రపంచానికి చాటిచెప్పేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైంది. ప్రభుత్వ ప్రతిష్టాత్మక కార్యక్రమం 'ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక'లో భాగంగా మే 18 నుంచి 23 వరకు రాష్ట్ర వ్యాప్తంగా పర్యాటక వారోత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు.

-మిగతా 2 లో

## ప్రభుత్వ పాఠశాలల్లో
# అల్పాహారం పథకం

- రాష్ట్ర వ్యాప్తంగా వచ్చే విద్యా సంవత్సరం నుంచి అమలు
- ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ స్థాయి విద్య
- సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్

**హైదరాబాద్ మే17 (నేటి దర్శిని):**
ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. జగిత్యాల జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో నిర్వహించిన విద్యా

-మిగతా 2 లో

# ఎబోలా వైరస్ కలకలం

మొదటి తరువాయి

కారణంగా కాంగోలో 88 మంది మరణించారు. మరో 336 మందికి ఎబోలా వైరస్ సోకిందని ఆఫ్రికాలోనే అతిపెద్ద ప్రజారోగ్య కేంద్రం సెంటర్స్ ఫర్ డిసీజ్ కంట్రోల్ అండ్ ప్రివెన్షన్ (సీడీసీ) శనివారం తెలిపింది. ఈ మేరకు ప్రపంచ ఆరోగ్య సంస్థ అప్రమత్తమైంది. బండిబుగ్యో ఎబోలా వైరస్ రకం వల్ల సంభవించిన ఈ వ్యాప్తి అంతర్జాతీయంగా ఆందోళన కలిగించే విషయమని డబ్ల్యూహెచ్ఓ అభిప్రాయపడింది. ఎబోలా కేసుల సంఖ్య, వ్యాప్తి వాస్తవ పరిస్థితిపై స్పష్టత లేదని తెలిపింది. ఈ క్రమంలో అంతర్జాతీయ ఆరోగ్య అత్యవసర పరిస్థితిని ప్రకటిస్తూ నిర్ణయం తీసుకుంది. కాగా, ఇది అంతర్జాతీయ ఆరోగ్య నిబంధనల ప్రకారం రెండో అత్యున్నత హెచ్చరిక స్థాయి.

కాంగోలో ఆందోళనకరంగా వైరస్ వ్యాప్తి : డబ్ల్యూహెచ్ఓ

ఎబోలా సంక్రమించిన వ్యక్తుల వాస్తవ సంఖ్య, భౌగోళిక వ్యాప్తికి సంబంధించి క్లారిటీ రావాల్సి ఉందని ప్రపంచ ఆరోగ్య సంస్థ తెలిపింది. ఈ ఎబోలా వైరస్ వల్ల ప్రపంచ దేశాలకు తక్షణ ముప్పు లేకపోయినా, కాంగో పొరుగు దేశాలకు వేగంగా వ్యాప్తి చెందే అవకాశం ఉందని హెచ్చరించింది. ఇప్పటికే కాంగోలో ఎబోలా వైరస్ వ్యాప్తి ఆందోళన కలిగిస్తోందని పేర్కొంది.

**కాంగో హెల్త్ మినిస్టర్ ఏమన్నారంటే?**

తమ దేశంలో ఎబోలా వైరస్ వ్యాప్తిపై కాంగో ఆరోగ్య మంత్రి శామ్యూల్ రోజర్ కంబా స్పందించారు. బుండిబుగ్యో రకం ఎబోలా వైరస్‌కు వ్యాక్సిన్ లేదన్నారు. ఈ వైరస్ వ్యాప్తికి నిర్దిష్ట చికిత్స లేదని చెప్పారు. ఈ వైరస్ సోకిన మొదటి రోగి ఒక నర్సు అని తెలిపారు. ఆమె ఈ ఏడాది ఏప్రిల్ 24న ఇటూరి ప్రావిన్స్ రాజధాని బునియాలోని ఒక ఆరోగ్య కేంద్రానికి ఎబోలా లక్షణాలతో వచ్చారని వెల్లడించారు. ఈ వ్యాధి సోకితే జ్వరం, రక్తస్రావం, వాంతులు వంటి లక్షణాలు కనిపిస్తాయని ఖ.

ఈ వ్యాధి వేగంగా వ్యాప్తి చెందడాన్ని అత్యంత ఆందోళనకరంగా వైద్య సహాయక బృందం డాక్టర్స్ వితౌట్ బోర్డర్స్ (ఎంఎస్ఎఫ్) పేర్కొంది. ఇంత తక్కువ సమయంలో ఇన్ని ఎబోలా కేసులు నమోదవ్వడం, మరణాలు అత్యంత ఆందోళన కలిగించే విషయమని అభిప్రాయపడింది. ఈ సంస్థ ప్రస్తుతం ఎబోలా వైరస్ వ్యాప్తి చెందిన ఇటూరి ప్రాంతానికి వైద్య, సహాయక సిబ్బందిని తరలిస్తోంది.

## ఒప్పందానికి రాకపోతే
# బ్యాడ్ టైమే

మొదటి తరువాయి

ఎదుర్కొంటుందని హెచ్చరించారు. కాగా, ఇరాన్‌పై తీవ్రస్థాయిలో దాడులు చేసేందుకు పెంటగాన్ సన్నాహాలు చేస్తున్నదని, ఈసారి అధికారికంగా యుద్ధం పేరును 'ఆపరేషన్ స్లెడ్జ్‌హ్యామర్'గా మార్చేందుకు యోచిస్తున్నదని ఒక మిలిటరీ ఉన్నత అధికారి తెలిపారు.

ఇరాన్‌కు ఐదు షరతులు..

యుద్ధం ముగింపుపై అమెరికా, ఇరాన్ మధ్య సంప్రదింపులు కొనసాగుతున్నాయి. ఇరు వర్గాల మధ్య చర్చలకు సంబంధించి ఇరాన్ పంపిన ప్రతిపాదనలపై అమెరికా ఐదు షరతులు విధించినట్టు 'ఇరాన్ మీడియా' తెలిపింది. అమెరికా నుంచి ఎలాంటి స్పష్టమైన రాయితీలు అందులో లేవని, చర్చల్లో ప్రతిష్ఠంభనకు దారితీస్తున్నదని ఇరాన్ నాయకత్వం పేర్కొన్నది. అమెరికా పంపిన షరతుల జాబితాను 'ఫార్స్ న్యూస్ ఏజెన్సీ' విడుదల చేసింది. దీని ప్రకారం, ఇరాన్‌లోని అణు కేంద్రాల్లో ఒక్కదానికి మాత్రమే 'నిర్వహణ'కు అమెరికా అనుమతించింది. శుద్ధి చేసిన యురేనియం నిల్వలన్నీ అమెరికాకు స్వాధీనం చేయాలన్నది మరో షరతు. విదేశాల్లోని ఇరాన్ ఆస్తుల్లో 'కనీసం 25' శాతం కూడా విడుదల చేయబోమని యూఎస్ తెలిపింది. ఇరాన్ యుద్ధ నష్టాలకు పరిహారం ఉండదని పేర్కొన్నది. చర్చలు ప్రారంభంతోనే.. అంతటా ఘర్షణలు ఆపాలన్నది అమెరికా విధించిన ఐదవ షరతు.

# గురుకులాలు, వసతి గృహ పాఠశాలలకు 'భవన అద్దె'

మొదటి తరువాయి

ఈ సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. ఇందులో భాగంగా మొదటి త్రైమాసిక (మూడు నెలలకోసారి) చెల్లింపుల విధానాన్ని తీసుకువచ్చి, ప్రస్తుతం దాన్ని నెలవారీ చెల్లింపుల విధానంగా మార్చారు. 2026-27 బడ్జెట్ ప్రవేశపెట్టిన సందర్భంలోనే ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఈ కీలక మార్పును ప్రకటించడం గమనార్హం. ఈ నిర్ణయం వల్ల విద్యార్థులకు నిరంతరాయంగా పోషకాహారం అందడంతో పాటు హాస్టళ్ల సక్రమ నిర్వహణ, భవనాల అద్దెల చెల్లింపులు సాఫీగా సాగనున్నాయి. ఇది విద్యార్థుల విద్యా ఫలితాలను, పాఠశాలల వాతావరణాన్ని మెరుగుపరచడానికి ఎంతగానో దోహదపడుతుంది. నెలవారీ చెల్లింపుల నిర్ణయంలో భాగంగా.. వివిధ సంక్షేమ, విద్యా శాఖల పరిధిలోని వసతి గృహ విద్యాసంస్థల ఆహార, కాస్మెటిక్స్ ఖర్చులు, భవన అద్దెల కోసం ప్రభుత్వం రూ. 221.24 కోట్లను విడుదల చేసింది. ఈ నిధుల విడుదల ద్వారా వసతి గృహ పాఠశాలల్లోని విద్యార్థుల పోషణ, సంక్షేమం మరియు వసతి సదుపాయాలకు పూర్తి స్థాయిలో నిరంతర మద్దతు లభించనుంది. "అణగారిన వర్గాల విద్యార్థులకు నాణ్యమైన విద్య, మెరుగైన నివాస సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉంది. విద్యార్థుల సమగ్ర అభివృద్ధి, సాధికారత సాధించడమే కాకుండా, వారిని సమాజానికి ఉపయోగపడే బాధ్యతాయుత పౌరులుగా తీర్చిదిద్దడమే మా ప్రభుత్వ లక్ష్యం" అని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు.

## ఆ ఆరు రోజులు తెలుగు రాష్ట్రాల్లో
# నిప్పుల వర్షమే!

మొదటి తరువాయి



ఉన్నందున ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. ప్రధానంగా ఉదయం 10:30 గంటల నుంచి సాయంత్రం 4:00 గంటల మధ్య అత్యవసరమైతే తప్ప ఎవరూ బయటకు రావద్దని స్పష్టం చేశారు. బయటకు వెళ్లాల్సి వస్తే తప్పనిసరిగా తాగునీటి బాటిల్స్ ను వెంట ఉంచుకోవాలని, వదులుగా ఉండే కాటన్ దుస్తులు ధరించాలని సూచించారు. శరీరం డీహైడ్రేషన్ కు గురికాకుండా ఉండేందుకు కొబ్బరి బొండాలు, మజ్జిగ, ఓఆర్ఎస్ ద్రావణం వంటివి ఎక్కువగా తీసుకోవాలని వైద్యులు సలహా ఇస్తున్నారు. ముఖ్యంగా వృద్ధులు, చిన్నపిల్లలు, గర్భిణీ స్త్రీలు, రోగులు ఈ కాలంలో ఎండకు దూరంగా, సురక్షితమైన ప్రదేశాల్లోనే ఉండటం శ్రేయస్కరం.

# శంకుస్థాపనకు రండి.

**-సీఎం రేవంత్ కు యాదాద్రి అర్చకులు, అధికారుల ఆహ్వానం**
**-సరస్వతీ అంత్య పుష్కరాలకు సైతం ఇన్విటేషన్ అందజేత**

**తెలంగాణ బ్యూరో:** యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్టలో ఏర్పాటు చేయబోయే శ్రీ లక్ష్మీనరసింహస్వామి వేద పాఠశాల శంకుస్థాపన కార్యక్రమానికి రావాల్సిందిగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని దేవస్థానం అర్చకులు, అధికారులు ఆహ్వానించారు. ఆదివారం జూబ్లీహిల్స్‌లోని సీఎం నివాసంలో ఆయనను మంత్రి కొండా సురేఖ, యాదగిరిగుట్ట దేవస్థానం అర్చకులు కలిసి ఆహ్వానించారు. ఈ నెల 23న యాదగిరిగుట్టలో శ్రీలక్ష్మీనరసింహస్వామి వేద పాఠశాల, దేవస్థాన ఇతర అభివృద్ధి పనుల శంకుస్థాపన కార్యక్రమం జరగనుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మంత్రి కొండా సురేఖ, ఎంపీలు వేం నరేందర్ రెడ్డి, చామల కిరణ్ కుమార్ రెడ్డి,



ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, కమిషనర్ హనుమంతరావు, యాదగిరిగుట్ట ఆలయ ఈవో భవానీశంకర్, ఆలయ అర్చకులు పాల్గొన్నారు. అదేవిధంగా ఈ నెల 21 నుంచి జూన్ 1 వరకు భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం కాళేశ్వరంలో జరగనున్న సరస్వతీ అంత్య పుష్కరాలకు రావాల్సిందిగా మంత్రి కొండా సురేఖ, శ్రీకాళేశ్వర ముక్తేశ్వరస్వామి దేవస్థాన అర్చకులు సీఎంను ఆహ్వానించారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో
# అల్పాహారం పథకం

మొదటి తరువాయి



వారోత్సవాల కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి... ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ స్థాయి విద్య, మౌలిక వసతులు, నాణ్యమైన భోజనం కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో అల్పాహారం పథకం అమలు చేయనున్నట్లు వెల్లడించారు. విద్య ద్వారానే సమాజ వికాసం సాధ్యమని పేర్కొన్న మంత్రి... జగిత్యాల జిల్లా పదో తరగతి ఫలితాల్లో 98.88 శాతం ఉత్తీర్ణతతో రాష్ట్రంలో నాలుగో స్థానం సాధించిన విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులను అభినందించారు. జిల్లాలో ప్రభుత్వ పాఠశాల మౌలిక వసతుల అభివృద్ధికి రూ. 8 కోట్ల ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే సంజయ్ కుమార్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ దినేష్ పాటి, వివిధ ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

# ఢిల్లీకి ఎండ గండం.

అలాంటిది మరో ఐదు డిగ్రీల ఎండలు పెరగడమంటే సాధారణ విషయం కాదు. ఢిల్లీ వైపు తూర్పు నుంచి వీచే గాలుల దిశ మారడం వల్లే ఈ పరిస్తితి ఉందని నిపుణులు అంటున్నారు. ఈ గాలులు కాస్త చల్లదనాన్ని, తేమను అందిస్తాయి. కానీ, ఇప్పుడు రాజస్థాన్, పాకిస్తాన్ నుంచి వాయువ్య దిశలో వేడి గాలులు వీస్తుండటం వల్ల ఎండ, వేడి పెరుగుతోందని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. ఈ గాలుల్లో ఎలాంటి తేమ ఉండదు. ఈ కారణంగా ఎండలు దాదాపు నాలుగైదు డిగ్రీలు పెరగవచ్చు. మే 23 వరకు ఇదే తరహా ఎండలు కాసే అవకాశం ఉంది. ఢిల్లీలోనే కాకుండా పంజాబ్, హరియాణా, చండీగఢ్, రాజస్థాన్, ఉత్తర ప్రదేశ్, మధ్య ప్రదేశ్, విదర్భ, ఛత్తీస్‌గఢ్‌లకు కూడా భారీ ఎండలు తప్పవని ఐఎండీ తెలిపింది. విదర్భలోని కొన్ని ప్రాంతాల్లో ఇప్పటికే 46 డిగ్రీల ఎండ నమోదవుతోంది. ఢిల్లీలో రాత్రి ఉష్ణోగ్రతలు కూడా సాధారణ స్థాయికి మించి పెరిగే అవకాశం ఉంది. ఇదే సమయంలో ఢిల్లీలో వీలైనంత వరకు ఉద్యోగులకు వర్క్ ఫ్రం హోం అవకాశం కల్పించాలని సీఎం రేఖా గుప్తా.. ప్రైవేటు కంపెనీలకు సూచించారు.

## నేటి నుంచే
# 'పర్యాటకవారోత్సవాలు'

మొదటి తరువాయి



పర్యాటక శాఖ ఆధ్వర్యంలో... భాషా సాంస్కృతిక, పురావస్తు (హెరిటేజ్) శాఖలు, నిథమ్ సంస్థల సంయుక్త సమన్వయంతో ఈ ఉత్సవాలను ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్నారు. ఈ వారోత్సవాల ప్రారంభం సందర్భంగా పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు సోమవారం పలు కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. ఉదయం 10:00 గంటలకు జహీరాబాద్‌లోని స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్‌లో అడ్మిషన్ల, కెరీర్ గైడెన్స్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొంటారు. మధ్యాహ్నం 4:00 గంటలకు అంతర్జాతీయ మ్యూజియం దినోత్సవం సందర్భంగా నాంపల్లి పబ్లిక్ గార్డెన్స్‌లోని స్టేట్ మ్యూజియంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో పాల్గొంటారు. ఇదే వేదికపై కొలనుపాక సైట్ మ్యూజియం, ఆలంపూర్ సైట్ మ్యూజియం ప్రత్యేక బ్రోచర్లతో పాటు, 'టూరిస్ట్ గైడ్ ఇన్ తెలంగాణ' పోస్టర్‌ను మంత్రి ఆవిష్కరిస్తారు. తెలంగాణలో పర్యాటక రంగానికి ఉన్న అపారమైన అవకాశాలను ప్రపంచానికి పరిచయం చేయడమే ఈ వారోత్సవాల ప్రధాన లక్ష్యం. ఎకో-టూరిజం ప్రదేశాలను ప్రమోట్ చేయడంతో పాటు, పర్యాటక రంగం ద్వారా యువతకు లభించే ఉపాధి అవకాశాలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించనున్నారు. చారిత్రక కట్టడాల ప్రాశస్త్యాన్ని వివరించేలా ప్రత్యేక కార్యక్రమాలు అలాగే ప్రముఖ పర్యాటక ప్రాంతాల్లో పరిశుభ్రత డ్రైవ్‌లు చేపడతారు. సోషల్ మీడియా ఇన్ ఫ్లుయెన్సర్లు, యూట్యూబర్లతో డిజిటల్ ప్రచారం కింద ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తారు. అంతే కాకుండా జిల్లా స్థాయిల్లో పర్యాటక ప్రాధాన్యతపై ప్రత్యేక సదస్సులు, ప్రచారాలు నిర్వహిస్తారు. అలాగే జిల్లాల్లో సాంస్కృతిక కార్యక్రమాలు కూడా నిర్వహించనున్నారు. ఈ ఉత్సవాల కార్యచరణ ప్రణాళికలో భాగంగా హైదరాబాద్‌లోని రవీంద్రభారతితో పాటు అన్ని జిల్లా కేంద్రాల్లో తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలు ప్రతిబింబించేలా విస్తృత ఏర్పాట్లు చేశారు. జానపద కళా ప్రదర్శనలు, వీరత్వానికి ప్రతీక అయిన పేరిణి నృత్యం, శాస్త్రీయ నృత్యాలు, సాహిత్య కార్యక్రమాలు, సంగీత కచేరీల నిర్వహణకు ఏర్పాట్లు చేశారు.

## రైతు కన్నీళ్లకు
# కారణం ఎవరు..?

మొదటి తరువాయి





నెలకొన్నదని తెలిపారు. దీంతో ప్రతి క్వింటాల్‌పై రైతుకు సుమారు రూ.600 నష్టం వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. పంట సాగు కోసం రైతులు ప్రైవేట్ వ్యక్తుల వద్ద అధిక వడ్డీలకు అప్పులు తెచ్చుకుంటున్నారని, ఆ అప్పులు తీర్చలేక చివరకు తక్కువ ధరకే ధాన్యాన్ని దళారులకు అమ్ముకోవాల్సి వస్తోందని పేర్కొన్నారు. ప్రభుత్వం నుంచి చెల్లింపులు ఆలస్యం కావడం వల్ల రైతులు తీవ్ర ఆర్థిక సంక్షోభంలో చిక్కుకుంటున్నారని అన్నారు. కొనుగోలు కేంద్రాల్లో అవినీతి అధికారుల నిర్లక్ష్యం కారణంగా రైతులు రోజుల తరబడి ధాన్యం కళ్లాల్లోనే నిల్వ ఉంచాల్సి వస్తోందని విమర్శించారు. సరైన రక్షణ లేక ధాన్యం తడిసి నష్టపోతుండగా, రైతుల కళ్లల్లో కన్నీళ్లు మాత్రమే మిగులుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో పెరుగుతున్న రైతు ఆత్మహత్యలు ప్రభుత్వ వైఫల్యాలకు నిదర్శనమని ఆయన అన్నారు. "రైతు ఆత్మహత్య చేసుకుంటే దాన్ని సాధారణ మరణంగా కాకుండా ప్రభుత్వ హత్యగా పరిగణించాలి. రైతు బతికితేనే దేశం బతుకుతుంది" అని తీవ్ర వ్యాఖ్యలు చేశారు.రైతుల పట్ల ప్రభుత్వాలు చిత్తశుద్ధితో వ్యవహరించాలని, వెంటనే ధాన్యం కొనుగోలు కేంద్రాలను సమర్థవంతంగా నిర్వహించాలని, దళారులపై కఠిన చర్యలు తీసుకోవాలని తెలంగాణ రక్షణ సేన డిమాండ్ చేసింది. రైతుకు గిట్టుబాటు ధర, తక్షణ చెల్లింపులు అందేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరింది.

# సూదిని రామ్ రెడ్డి కి అభినందన సన్మాన కార్యక్రమాన్ని విజయవంతం చేద్దాం...

**ఆమనగల్లు,మే17(నేటి దర్శిని);**
తెలంగాణ పంచాయితీ ట్రిబ్యునల్ చైర్మన్ గా ఇటీవల నియమితులైన సూదిని రామ్ రెడ్డి కి అభినందన సన్మాన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని టిపిసిసి సభ్యులు ఆయిల్ల శ్రీనివాస్ గౌడ్ పిలుపునిచ్చారు. ఆమనగల్లు పట్టణంలోని కళ్యాణి గార్డెన్ లో కల్వకుర్తి నియోజకవర్గం ముఖ్య కార్యకర్తల సమావేశం ఆదివారం నిర్వహించారు.ఈ సమావేశానికి కాంగ్రెస్, యువజన కాంగ్రెస్ ఎన్ఎస్ యుఐ నాయకులు,కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులు, తదితరులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. సూదిని రామ్ రెడ్డి అభినందన సన్మాన కార్యక్రమం గురించి సమావేశంలో చర్చించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో కష్టపడ్డ కాంగ్రెస్ కార్యకర్తలు అందరికీ సముచిత స్థానం కల్పిస్తున్నట్లు తెలిపారు. కల్వకుర్తి నియోజకవర్గం లోని మార్పుల మండల కేంద్రానికి చెందిన మాజీ ఎంపీపీ సూదిని రామ్ రెడ్డికి పంచాయతీరాజ్ ట్రిబ్యునల్ చైర్మన్ గా నియమించడం అభినందనీయమని అన్నారు. చైర్మన్ పదవితో కల్వకుర్తి నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందుతుందని శ్రీనివాస్ గౌడ్ ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. సూదిని రామ్ రెడ్డి అభినందన సన్మాన



కార్యక్రమం ఈనెల 20వ తేదీన బుధవారం ఉదయం గం 10:30 నిమిషములకు ఆమనగల్లు పట్టణంలోని శ్రీ లక్ష్మీ గార్డెన్ లో కల్వకుర్తి శాసనసభ్యులు కసిరెడ్డి నారాయణరెడ్డి సారథ్యంలో నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. నియోజకవర్గంలోని ఏడు మండలాలు,రెండు మునిసిపాలిటీల పరిధిలోని ప్రజలు,కార్యకర్తలు, వివిధ పార్టీల నేతలు రాజకీయాల కతీతంగా హాజరై సన్మాన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని శ్రీనివాస్ గౌడ్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆమనగల్లు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బట్టు కిషన్ రెడ్డి,బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నరసింహ, మున్సిపల్ చైర్మన్ పత్యా నాయక్,మాజీ జెడ్పిటిసి శ్రీనివాస్ రెడ్డి, ఆకుతోటపల్లి గ్రామ సర్పంచ్ నేలపట్ల నరేందర్ రెడ్డి,మండల పార్టీ అధ్యక్షుడు తెలగమల్ల జగన్, ఆదివాసి నాయకులు కృష్ణ నాయక్,ఐఎన్ టియుసి రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు ఎంగలి ప్రసాద్,కాంగ్రెస్ సీనియర్ నాయకులు అవ్వారి శివలింగం,కాలే మల్లయ్య, మున్సిపల్ కో ఆప్షన్ మెంబర్ ఎండి అబ్దుల్ ఖాదర్,ఫరీద్, మహేష్,రాజు,శ్రీధర్ రెడ్డి,గోల్డ్ రాము, నిరంజన్,శేఖర్,కుమార్ గౌడ్, శ్రీశైలం, శివ,ఎండి అబ్దుల్ రహీం,తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాల,కళాశాల విద్యార్థుల ప్రతిభే రాష్ట్రానికి గర్వకారణమని ప్రశంస: ఎమ్మెల్యే కేఆర్ నాగరాజ్

- నాణ్యమైన విద్య అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం
- విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలని పిలుపు



**ఉమ్మడి వరంగల్, మే 17 (నేటి దర్శిని బ్యూరో):**
ప్రభుత్వ పాఠశాలను బలోపేతం చేస్తూ గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు కూడా నాణ్యమైన విద్య అందించే దిశగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం అనేక సంస్కరణలు చేపడుతుందని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజ్ తెలిపారు.తెలంగాణ రాష్ట్ర ప్రజాపాలన -- ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా వరంగల్ విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన "విద్యా విజయోత్సవాలు 2025-26" కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజ్ ,వరంగల్ జిల్లా కలెక్టర్. డాక్టర్ సత్య శారద, కూడా చైర్మన్ ఇనుగాల వెంకటరామిరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లాలోపదోతరగతి ,ఇంటర్మీడియట్‌లో అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థి విద్యార్థినీలను సన్మానించారు. అనంతరం ఉత్తమ ఫలితాలు సాధించిన పదో తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థులకు శాలువాలు కప్పి అభినందన పత్రాలు, క్యాష్ ప్రైజులు అందజేశారు. అలాగే వరంగల్ కృష్ణకాలనీ ప్రభుత్వ పాఠశాలకు చెందిన ప్రతిభావంతుడైన విద్యార్థికి లక్ష రూపాయల చెక్కును అందజేసి ప్రోత్సహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజుమాట్లాడుతూతెలంగాణ ప్రభుత్వం విద్యారంగ అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేస్తూ గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు కూడా నాణ్యమైన విద్య అందించే దిశగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం అనేక సంస్కరణలు చేపడుతోందని తెలిపారు.విద్యార్థుల విజయం వెనుక తల్లిదండ్రుల త్యాగం, ఉపాధ్యాయుల కృషి, విద్యార్థుల పట్టుదల కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. ముఖ్యంగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో అద్భుత ఫలితాలు సాధించడం ఎంతో ఆనందంగా ఉందని పేర్కొన్నారు. పేద కుటుంబాలకు చెందిన పిల్లలు ఉన్నత శిఖరాలను అధిరోహిస్తూ సమాజానికి ఆదర్శంగా నిలవడం గర్వకారణమని అన్నారు.విద్య అనేది వ్యక్తిగత అభివృద్ధికే కాకుండా సమాజ ప్రగతికి కూడా మూలాధారమని, ప్రతి విద్యార్థి ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలని సూచించారు. భవిష్యత్‌లో డాక్టర్లు, ఇంజినీర్లు, శాస్త్రవేత్తలు, పరిపాలనా అధికారులు, ప్రజాసేవకులుగా ఎదిగి తెలంగాణ రాష్ట్ర ఖ్యాతిని దేశవ్యాప్తంగా చాటాలని ఆకాంక్షించారు.అలాగే విద్యార్థుల ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడం ద్వారా మరింత మంది విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెరుగుతుందని, ప్రభుత్వ పాఠశాలలపై సమాజంలో విశ్వాసం మరింత బలపడుతుందని ఎమ్మెల్యే నాగరాజు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ శ్రీమతి సంధ్యా రాణి, డీఈవో రంగనాయుడు, డిఏఓ విజయలక్ష్మి విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# జనాభా గణన దేశ భవిష్యత్ అభివృద్ధికి బలమైన పునాది

- జిల్లా కలెక్టర్ సత్యశారద ఎమ్మెల్యే నాగరాజు

**ఉమ్మడి వరంగల్, మే17(నేటి దర్శిని బ్యూరో):**
ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు సమర్థవంతంగా అమలు కావాలంటే జనాభా గణన అత్యంత కీలకమని గౌరవ వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే, కె.ఆర్. నాగరాజు పేర్కొన్నారు. వరంగల్ జిల్లా వర్ధన్నపేట పట్టణ కేంద్రం లోని స్వామి వివేకానంద విగ్రహం నుంచి అంబేద్కర్ సెంటర్ వరకు నిర్వహించిన జనాభా గణన అవగాహన ర్యాలీ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే నాగరాజు , వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద పాల్గొని జండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ జనాభా గణన అనేది కేవలం లెక్కలు సేకరించే ప్రక్రియ మాత్రమే కాకుండా దేశ భవిష్యత్ అభివృద్ధికి దిశానిర్దేశం చేసే మహత్తర కార్యక్రమమని అన్నారు. దేశంలోని ప్రతి కుటుంబం, ప్రతి వ్యక్తి గురించి సమగ్ర సమాచారం సేకరించడం ద్వారా ప్రభుత్వాలు ప్రజల అవసరాలను అంచనా వేసి సరైన విధానాలు రూపొందించగలుగుతాయని తెలిపారు.ప్రత్యేకంగా గ్రామీణ మరియు పట్టణ ప్రాంతాల్లో విద్య, వైద్యం,




రోడ్లు, తాగునీరు, గృహ నిర్మాణం, ఉపాధి అవకాశాలు, మహిళా మరియు బాలల సంక్షేమం వంటి రంగాల్లో ప్రణాళికాబద్ధమైన అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు జనాభా గణన ద్వారా లభించే సమాచారం ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.ప్రజలు జనాభా గణన సిబ్బందికి పూర్తి సహకారం అందించి ఖచ్చితమైన వివరాలు ఇవ్వాలని కోరారు. సరైన సమాచారం అందించడం ప్రతి పౌరుడి బాధ్యత అని, ప్రజల సహకారంతోనే ప్రభుత్వ అభివృద్ధి ప్రణాళికలు విజయవంతమవుతాయని తెలిపారు. అభివృద్ధి చెందిన భారత నిర్మాణంలో ప్రతి పౌరుడి భాగస్వామ్యం అవసరమని, అందులో జనాభా గణన ఒక ముఖ్యమైన అడుగుగా నిలుస్తుందని ఎమ్మెల్యే నాగరాజు అన్నారు.ఈ అవగాహన ర్యాలీలో వర్ధన్నపేట మున్సిపల్ చైర్మన్ పాలకుర్తి సారంగపాణి, వ్యవసాయ మార్కెట్ చైర్మన్ నరకుడు వెంకటయ్య, ఐనవోలు ఆలయ చైర్మన్ కమ్మగోని ప్రభాకర్ గౌడ్, వర్ధన్నపేట ఫ్యాక్స్ చైర్మన్ రాజేష్ ఖన్నా, వైస్ చైర్మన్ నేతావాత్ శిభారాణి- రాజేందర్, కౌన్సిలర్లు బెజ్జం పాపారావు, నునావత్ కమ్లి-కీమా, మలోత్ దేవేందర్, తిరుపెల్లి వాణి- కుమారస్వామి తో జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు తుల్లా రవి, పట్టణ పార్టీ అధ్యక్షుడు మైస సురేష్, మండల పార్టీ అధ్యక్షుడు ఎద్దు సత్యనారాయణ, కాంగ్రెస్ నాయకులు ఈగ దామోదర్, పోశాల వెంకన్న గౌడ్, తో పాటు సర్పంచ్లు, మండల, టౌన్ పార్టీ నాయకులు కార్యకర్తలు, యూత్, మహిళలు మరియు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## లక్ష్మీ నరసింహా స్వామి దేవాలయంలో భవాని రామలింగేశ్వర భజన మండలిచే భజన కార్యక్రమం...



**ఆమనగల్,మే17(నేటి దర్శిని);**
ఆమనగల్లు పట్టణంలోని భవాని రామలింగేశ్వర స్వామి భజన మండలి వారిచే రంగారెడ్డి జిల్లా, రావిర్యాల గ్రామంలోని శ్రీ చైత్ర లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో శనివారం రాత్రి నుండి తెల్లవారుజాము వరకు భజన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహిళలు,భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.ఈ భజన కార్యక్రమంతో గ్రామంలో భక్తి పారవశ్యంతో,పండగ వాతావరణాన్ని తలపించింది.ఈ కార్యక్రమంలో భక్తి(భజన) గీతాలు ఆలపించిన వారు చింతోజు వివేకానందాచారి, గాజుల శ్రీనివాసులు, ముక్కెరి కృష్ణయ్య,గాజుల వెంకటేష్, సాయిలు, ఉప్పు రాములు, చంద్రమౌళి చారి, దావ నరసింహ,పుల్లారెడ్డి వెంకటమ్మ, యాదగిరి,గ్రామ ప్రజలు,గ్రామ పెద్దలు,తదితరులు పాల్గొన్నారు.

## మానవత్వం పరిమళించిన వేళ....



**ఆమనగల్లు,మే17(నేటి దర్శిని);**
ఆమనగల్లు పట్టణంలో మతిస్థిమితం లేని వ్యక్తికి మానవతా హృదయంతో టాక్సీ డ్రైవర్స్ అసోసియేషన్ సభ్యులు అతని బాగోగులను చూస్తున్నారు.స్థానిక మండల పరిషత్ కార్యాలయం పరిసరాలలో ప్రతిరోజు తిరుగుతున్నాడు. మండల పరిషత్ కార్యాలయం వెనుక భాగం లోని ఒక పాడుబడిన భవనంలో అతను గత ఐదు నెలలుగా తలదాచుకుంటున్నాడని టాక్సీ డ్రైవర్ అసోసియేషన్ సభ్యుడు ఎడ్ల శ్రీశైలం తెలిపారు.ఆ మతిస్థిమితం లేని వ్యక్తికి డ్రైవర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అతనికి క్షవరం, స్నానం చేయించి నూతన వస్త్రాలను సంఘ సభ్యులే సమకూర్చారు. అతనికి ఉదయం ఫలహారం మధ్యాహ్న రాత్రికి భోజనాన్ని ఎడ్ల శ్రీశైలం సమకూరుస్తున్నాడు. తన సంబంధించిన వివరాలను అతను చెప్పడం లేదని,మనం మాట్లాడిన,అతను మాట్లాడడం లేదని ఎడ్ల శ్రీశైలం తెలిపారు.అందుకే దాతలు స్పందించి ఇతని వివరాలను తెలుసుకొని అలాగే ఏదైనా స్వచ్ఛంద సంస్థల లో చేర్పించి అతన్ని ఆదుకోవాలని టాక్సీ డ్రైవర్స్ సభ్యులు కోరుకుంటున్నారు. ఈ కార్యక్రమంలో మసున సత్యం,గజ్జె అల్లాజి, శ్రీశైలం,జైహింద్,మహేష్, తదితరులు పాల్గొన్నారు.


## శంకర్ నగర్ అభివృద్ధికి కృషి చేసిన నవజీవన్ రెడ్డికి ఘన సన్మానం



**హయత్‌నగర్, మే17 (నేటి దర్శిని):**
ఉమ్మడి హయత్‌నగర్ డివిజన్ పరిధిలోని శంకర్ నగర్ కాలనీలో సీసీ రోడ్ల నిర్మాణ పనులు పూర్తి కావడంతో కాలనీవాసులు ఆనందం వ్యక్తం చేస్తూ స్థానిక మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డిని ఘనంగా సన్మానించారు. అభివృద్ధి పనులకు కృషి చేసినందుకు శాలువాతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా కాలనీవాసులు మాట్లాడుతూ, ఎన్నో సంవత్సరాలుగా ఎదురుచూస్తున్న సీసీ రోడ్ల నిర్మాణం పూర్తికావడం వల్ల కాలనీలో రవాణా సౌకర్యం మెరుగుపడిందని తెలిపారు. ముఖ్యంగా వర్షాకాలంలో ఎదురయ్యే బురద, నీటి నిల్వల సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించిందని పేర్కొన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ఎల్లప్పుడూ ముందుండే నాయకుడిగా కళ్లెం నవజీవన్ రెడ్డి పనిచేస్తున్నారని కొనియాడారు.కళ్లెం నవజీవన్ రెడ్డి మాట్లాడుతూ, ప్రజల ఆశీస్సులు, సహకారమే తనకు మరింత సేవ చేయడానికి ప్రేరణనిస్తోందని అన్నారు. హయత్‌నగర్ ప్రాంత అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తూ, ప్రతి కాలనీలో మౌలిక వసతుల అభివృద్ధే తన ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు పేల్లకూరి సుబ్బారెడ్డి, అధ్యక్షులు యాకాల రాజ్ కుమార్, జనరల్ సెక్రటరీ కేమ జనార్ధన్, సభ్యులు కడారి సత్యనారాయణ, ముక్కాం అంజయ్య, కట్ట మల్లయ్య, సరికొండ రామ్ రెడ్డి, శనగపాటి సునీల్, బత్తుల మల్లేశం, గుండారపు రాజారాం, గుర్రం శ్రీనివాస్, జయప్రకాశ్, జానకి రెడ్డి, రవి తదితరులు మరియు కాలనీవాసులు పాల్గొన్నారు.

## కెమికల్ ఇంజినీరింగ్‌లో మాస్టర్స్ పట్టా పొందిన కూచూరు మనిదీప్ రెడ్డి

- అమెరికాలోని ఇల్లినాయిస్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో మనిదీప్ ప్రతిభ
- ఆనందం వ్యక్తం చేసిన మనిదీప్ తల్లిదండ్రులు



**మిడ్జిల్ మే 17, (నేటి దర్శిని ప్రతినిధి):**
మిడ్జిల్ మండలానికి చెందిన కూచూరు శ్రీనివాస్ రెడ్డి కుమారుడు కూచూరు మనిదీప్ రెడ్డి అమెరికాలోని ప్రఖ్యాత ఇల్లినాయిస్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో కెమికల్ ఇంజినీరింగ్ విభాగంలో ప్రతిభ కనబరిచి మాస్టర్స్ పట్టా సాధించారు. యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ చేతుల మీదుగా పట్టాను అందుకుని ఘన సత్కారం పొందారు. దీంతో మనిదీప్ తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేస్తూ సంతోషాన్ని పంచుకున్నారు.విదేశాల్లో కెమికల్ ఇంజినీరింగ్‌లో మాస్టర్స్ పట్టా సాధించిన వారిలో మనిదీప్ ఒకరు. ఆయన ప్రాథమిక విద్యను హైదరాబాద్‌లోని ఆల్ సెయింట్స్ హై స్కూల్, అబిడ్స్‌లో అభ్యసించారు. అనంతరం శ్రీ చైతన్య జూనియర్ కాలేజ్, డీడీ కాలనీ, హైదరాబాద్‌లో ఇంటర్మీడియట్ పూర్తి చేశారు. తరువాత మణిపాల్ యూనివర్సిటీలో కెమికల్ ఇంజినీరింగ్‌లో బీటెక్ పూర్తి చేసి, ఉన్నత విద్య కోసం అమెరికాకు వెళ్లి ఇల్లినాయిస్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో కెమికల్ ఇంజినీరింగ్‌లో ఎంఎస్ పూర్తి చేయడం గర్వకారణమని కుటుంబ సభ్యులు తెలిపారు.

# సంపాదకీయం

# నిర్భయం



నిర్భయ కేసు భారతదేశ మనస్సాక్షిని కుదిపేసిన పధ్నాలుగేళ్ల తర్వాత, మహిళలకు బహిరంగ ప్రదేశాలు ఎంత అసురక్షితంగా ఉన్నాయో తెలిపే మరో భయంకరమైన సంఘటన ఢిల్లీకి ఎదురైంది. నిర్భయ తరహా ఘటనను తలపించేలా కదులుతున్న ప్రైవేట్ బస్సులో ఓ మహిళపై దుండగులు లైంగిక దాడికి పాల్పడ్డారు. దేశ రాజధానిలో జరిగిన ఈ సంఘటన పరిపాలన, పోలీసు వ్యవస్థ, రవాణా నియంత్రణ వైఫల్యాలకు అతి పెద్ద నిదర్శనం. ప్రయాణికుల రాకపోకలకు, భద్రతకు భరోసాగా వుండాల్సిన బస్సే... మరోసారి భయానక ప్రదేశంగా మారింది. బాధ్యతగా వ్యవహరించాల్సిన వారే వేటగాళ్లుగా మారారు. నిందితులను వెంటనే అరెస్టు చేసినట్లు చెబుతున్నా... వ్యవస్థాగతంగా పేరుకుపోయిన కుళ్లు మాత్రం అలాగే మిగిలిపోయింది. 2012 నిర్భయ దుర్ఘటన తర్వాత, ప్రభుత్వాలు సమగ్ర సంస్కరణలు చేస్తామని హామీ ఇచ్చాయి. చట్టాలు కఠినతరం అయ్యాయి. సీసీటీవీ నిఘాలు విస్తరించాయి, ఫాస్ట్‌ట్రాక్ కోర్టులు వచ్చాయి. మహిళల భద్రతపై గొప్ప గొప్ప హామీలు వినిపించాయి. 'బేటీ బచావో బేటీ పఢావో'- వంటి పథకాలు, నినాదాలతో హోరెత్తించారు. అయితే, 'మహిళలకు నిజంగా భద్రత పెరిగిందా?'- అన్నది పెద్ద ప్రశ్నగా మిగిలేవుంది.

ప్రభుత్వాలు, అధికారులు ఆర్భాటంగా ఎన్ని ప్రకటనలు చేసినా, క్షేత్రస్థాయి వాస్తవ కథ వేరేలా ఉంది. ప్రైవేట్ బస్సులు సరైన పర్యవేక్షణ లేకుండా నడుస్తూనే ఉన్నాయి. భద్రతా నియమాల అమలు నామమాత్రమే. సంస్థాగతమైన జవాబుదారీతనం కొరవడటంతో, మహిళలకు ఢిల్లీ ఒక అసురక్షిత నగరంగా మారింది. 'యత్ర నార్యస్తు పూజ్యంతే రమంతే తత్ర దేవతా'- అని గొప్పలు పోయే దేశంలో ఈ అరాచకాలు కేవలం ఢిల్లీకో, ఒక ప్రాంతానికో పరిమితం కాలేదు. 'యత్రైతాస్తు న పూజ్యంతే సర్వాస్తత్రాఫలా క్రియా'- -- అంటే... ఎక్కడ స్త్రీలు అవమానింపబడతారో, అక్కడ ఎంతటి శ్రేష్ఠమైన కార్యం జరిగినా అది నిష్ఫలంగా మిగిలిపోతుందన్న విషయాన్ని మాత్రం పక్కన పెట్టేస్తున్నారు. దేశవ్యాప్తంగా నిత్యం ఎక్కడో ఒకచోట మహిళలపై అఘాయిత్యాలు జరుగుతూనే ఉన్నాయి. వీధుల్లో తిరిగే ఆకతాయిలే కాదు, సమాజంలో హోదా, రాజకీయ అండదండలు ఉన్నవారు కూడా మహిళలపై దాడులకు తెగబడుతున్నారు. హైదరాబాద్ లో ఓ బాలికపై లైంగిక దాడి, వేధింపులకు పాల్పడితే, నిందితుడ్ని ఎలా తప్పించాలా? అని మల్లగుల్లాలు పడుతున్నారు. జనసేన రాష్ట్ర నాయకుడు ఓ మహిళపై పట్టపగలు, నడిరోడ్డుపై దాడి చేస్తే... పట్టించుకున్న నాథుడే లేడు. 'ఆడది అర్థరాత్రి ఒంటరిగా తిరిగినప్పుడే దేశానికి నిజమైన స్వాతంత్ర్యం'- అన్నారు గాంధీజీ. బాలికలు, మహిళలు నేడు పట్టపగలే తిరగలేని పరిస్థితి దేశంలో కనిపిస్తోంది. 'స్త్రీ స్వేచ్ఛను అంగీకరించని సమాజం ఎప్పటికీ స్వేచ్ఛావంతమైన సమాజం కాదు'- అని రచయిత్రి వర్జీనియా వూల్ఫ్ అంటారు. మన మహిళలకు ఈ దేశం స్వేచ్ఛాయుత దేశం అని అనగలమా? నిర్భయ ఘటన తర్వాత దేశవ్యాప్తంగా కొవ్వొత్తుల ర్యాలీలు జరిగాయి. ఆగ్రహంతో సోషల్ మీడియాలో హ్యాష్‌ట్యాగ్‌లు ట్రెండ్ చేస్తాం. కానీ ఆ ఆగ్రహం కొద్ది రోజులకే చల్లారిపోయింది. ఈ వ్యవస్థ, చట్టాలు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్టుగా వున్నాయి. నిర్భయ ఘటన తర్వాత చట్టాల్లో తెచ్చిన మార్పులు కేవలం కాగితాలకే పరిమితమయ్యాయి. మహిళలపై దాడులు యథావిధిగా జరుగుతూనే ఉన్నాయి. బాధితురాలి పేరును మార్చడం, ముఖాన్ని దాచడం, కొంత పరిహారం ప్రకటించడం తప్ప అసలు మూలాలపై చట్టం చర్యలు తీసుకోలేకపోతోంది. మహిళల భద్రతపై కొనసాగుతున్న వ్యవస్థాగత నిర్లక్ష్యం వల్ల సమాజం నిస్సత్తువగా మిగిలిపోతోంది. ఇది నాగరిక సమాజ వైఫల్యం. ఇలాంటి సంఘటనలు కొద్దిమంది వ్యక్తుల చర్యలుగా చూసే పరిమిత ధోరణి కాకుండా వీటికి మూలం ప్రపంచీకరణ వికృత సంస్కృతిని, దాన్ని అమలు చేస్తున్న పాలకుల విధానాల్లో ఉందని గుర్తించాలి. ఈ తాజా సంఘటన అయినా... మరో తాత్కాలిక వార్తాంశంగా మిగిలిపోకుండా, ఒక మలుపుగా మారాలి. అధికారులు ప్రైవేట్ రవాణా సంస్థలపై సమగ్ర తనిఖీ నిర్వహించాలి. రియల్-టైమ్ జీపీఎస్ ట్రాకింగ్‌ను తప్పనిసరి చేయాలి. కేవలం చట్టాలు చేయడమే కాదు, వాటిని అమలు జరిపే వ్యవస్థల్లో చిత్తశుద్ధి ఉండాలి. అంతకంటే ముఖ్యంగా, మహిళల భద్రతను కేవలం నినాదాలకు, ప్రచారార్భాటాలకే పరిమితం కాకుండా భరోసాగా నిలవాలి. మహిళలు స్వేచ్ఛాయుతంగా సాధికారత వైపు అడుగులు వేసినప్పుడే ఏ దేశమైనా నిజమైన పురోగతి సాధించగలదు.

## మసాజ్ పేరుతో మహిళలపై

# భారతీయుడి వేధింపులు..

### ఆస్ట్రేలియాలో 13 ఏళ్ల జైలు శిక్ష

**న్యూఢిల్లీ ,మే 17 (నేటి దర్శిని)**
మసాజ్ పేరుతో మహిళలపై లైంగిక వేధింపులకు పాల్పడ్డ భారతీయ సంతతి వ్యక్తికి ఆస్ట్రేలియాలోని కోర్టు భారీ శిక్ష విధించింది. 13 సంవత్సరాల 10 నెలల జైలు శిక్ష విధిస్తూ తాజాగా తీర్పు వెల్లడించింది. నిందితుడు సుమిత్ సతీష్ రస్తోగి (39) మహిళల్ని వేధించినట్లు కోర్టు గుర్తించడంతో అతడికి ఈ శిక్ష వేసింది. ఒక అంతర్జాతీయ మీడియా కథనం ప్రకారం.. న్యూఢిల్లీకి చెందిన సుమిత్ 2011లో ఆస్ట్రేలియా వెళ్లాడు. అక్కడ అడిలైడ్ సిటీలోని గ్లెన్‌లెగ్‌లో ఒక మసాజ్ పార్లర్ నడుపుతున్నాడు ,ఈ క్రమంలో 2021, అక్టోబర్ నుంచి 2022 జూలై వరకు.. అంటే ఈ తొమ్మిది నెలల కాలంలో దాదాపు 61 మంది మహిళలపై లైంగిక వేధింపులకు పాల్పడ్డాడు. మసాజ్ చేయించుకుంటున్న వారిని



అసభ్యంగా వీడియోలు తీయడం, అసభ్యంగా తాకడం వంటి 97 నేరాలకు పాల్పడ్డారు. ఇతడి వేధింపులకు గురైన బాధిత మహిళలు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సుమిత్ దారుణాలు వెలుగులోకి వచ్చాయి. బాధితుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన పోలీసులు.. అతడిని జూలై, 2022లో అరెస్టు చేశారు. ఇంతకాలం ఈ కేసు విచారణ కొనసాగింది. విచారణలో అతడు నేరం చేసినట్లు రుజువైంది. సుమిత్ వేధింపులకు గురైన మహిళలు తీవ్ర మనో వేధనకు గురైనట్లు కోర్టు గుర్తించింది. అతడి నేరాలకుగాను కోర్టు 13 సంవత్సరాల 10 నెలలపాటు జైలు శిక్ష విధించింది. ఇందులో పదేళ్ల, పది నెలలపాటు పెరోల్ పొందడానికి కూడా వీలు లేకుండా కోర్టు తీర్పునిచ్చింది. అంటే, 2035 వరకు అతడికి పెరోల్ లభించదు. ఇప్పటికే కొంతకాలం నుంచి అతడు జైలులో ఉన్నందున ఆ కాలాన్ని కూడా శిక్షగా పరిగణిస్తారు. ఈ జైలు శిక్ష కాలాన్ని పరిగణనలోకి తీసుకుని 2035లోనే పెరోల్ లభిస్తుంది. ఇక, సుమిత్ తన పూర్తి శిక్ష అనుభవించిన అనంతరం అతడిని ఆస్ట్రేలియా నుంచి తిరిగి ఇండియా పంపేయాలని కూడా కోర్టు ఆదేశించింది.

## రష్యా చమురుపై మినహాయింపు

# తొలగించిన ట్రంప్..

### దేశంలో పెట్రో ధరలు ఇంకా పెరుగుతాయా..?

**న్యూఢిల్లీ ,మే 17 (నేటి దర్శిని)**
ఇప్పటికే చమురు ధరల పెరుగుదలతో ఇబ్బంది పడుతున్న ప్రపంచానికి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరో షాకిచ్చారు. ఇటీవల రష్యా చమురు కొనుగోలుపై విధించిన మినహాయింపును రద్దు చేశారు. ఇరాన్ యుద్ధం, హోర్ముజ్ మూసివేత నేపథ్యంలో ఇండియా సహా వివిధ దేశాలకు రష్యా నుంచి చమురు కొనుగోలు చేసేందుకు ట్రంప్ తాత్కాలికంగా అనుమతించిన సంగతి తెలిసిందే. ఇప్పుడు ఈ మినహాయింపుపై విధించిన గడువు పూర్తైంది. అంటే, రష్యా చమురు కొనుగోలుపై ఆంక్షలు అమలవుతాయి. ఈ మినహాయింపును పొడిగించేందుకు ట్రంప్ సర్కార్ నిరాకరించింది. ఈ




నిర్ణయం వల్ల అందరికంటే ఎక్కువగా ఇబ్బంది పడే దేశం ఇండియానే. ఎందుకంటే రష్యా నుంచి ఇండియా ఎక్కువగా చమురు కొనుగోలు చేస్తుంది. అందులోనూ హోర్ముజ్ జలసంధి నుంచి చమురు రవాణా భారీగా తగ్గిపోవడం, అంతర్జాతీయంగా క్రూడాయిల్ ధరలు విపరీతంగా పెరిగిపోయిన పరిస్థితుల్లో ఇండియాకు రష్యా చమురు ఎంతగానో ఉపయోగపడింది. కొద్ది రోజులుగా భారీ స్థాయిలో రష్యా చమురును ఇండియా దిగుమతి చేసుకుంది. గత మార్చిలో 4.5 మిలియన్ బ్యారెళ్ల క్రూడాయిల్‌ను ఇండియా కొనుగోలు చేయగా, ఇందులో సగానికిపైగా చమురు రష్యా నుంచే దిగుమతి చేసుకుంది. ఇదే సమయంలో యుద్ధం జరుగుతున్న మిడిల్ ఈస్ట్ నుంచి చమురు దిగుమతి 61 శాతం తగ్గింది. గత ఏప్రిల్‌లో ఇండియాకు రష్యా అత్యధిక చమురు అందించింది. రోజుకు 1.57 మిలియన్ బ్యారెళ్ల చమురును ఇండియా దిగుమతి చేసుకుంది. ఇప్పుడు రష్యా నుంచి చమురు కొనుగోలును అమెరికా నిషేధించిన నేపథ్యంలో.. ఇండియా ఆ చమురును కొనకపోతే దేశంలో మరింత సంక్షోభం తప్పదు. ఇటీవలి కాలంలో వరుసగా పెట్రో ధరలు పెరుగుతున్న సంగతి తెలిసిందే. అలాంటిది రష్యా చమురు ఆగిపోతే పెట్రో బాదుడు భారీగా ఉండబోతుందని మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

## ఏండ్లుగా అత్యాచారం..

# వీడియోలు తీసి బ్లాక్ మెయిల్..

### -అక్కాచెల్లెళ్లు ఆత్మహత్య..!

**న్యూఢిల్లీ ,మే 17 (నేటి దర్శిని)**
రాజస్థాన్ లోని జోధ్‌పూర్ లో అత్యంత దారుణమైన ఘటన వెలుగుచూసింది. సంవత్సరాల తరబడి సామూహిక అత్యాచారం, బ్లాక్‌మెయిలింగ్‌కు గురైన ఇద్దరు అక్కాచెల్లెళ్లు నెలల వ్యవధిలోనే ఆత్మహత్యలు చేసుకున్నారు. పోలీసుల నిర్లక్ష్యంవల్లే వారు ప్రాణాలు కోల్పోయారని స్థానికులు ఆరోపించారు. వివరాల్లోకి వెళ్తే.. స్థానిక ఈ-మిత్ర సెంటర్ నిర్వాహకుడు మహిపాల్ తోపాటు 8 మంది యువకులు తనను కొన్నేళ్లుగా గ్యాంగ్ రేప్ చేసి, వీడియోలు తీసి బ్లాక్‌మెయిల్ చేస్తున్నారని ఆరోపిస్తూ ఓ యువతి గత మార్చి 20న ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన తర్వాత



ఏప్రిల్ 11న ఆమె చెల్లెలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. అయితే పోలీసులు నెలరోజులుగా ఎలాంటి చర్యలు తీసుకోలేదని, నిందితులు తనను కూడా బ్లాక్‌మెయిల్ చేసి లైంగిక దాడులకు పాల్పడ్డారని ఆమె ఆరోపించింది. న్యాయం జరగకపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురైన యువతి చెల్లెలు శుక్రవారం ఓ నీటి ట్యాంక్ ఎక్కి నిందితులను అరెస్ట్ చేయాలని డిమాండ్ చేసింది. అనంతరం విషం తాగి ఆత్మహత్యకు పాల్పడింది. ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే ఆమె ప్రాణాలు విడిచింది. ఈ ఘటనపై రాజ్‌పుత్ సమాజం తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేసింది. మృతదేహంతో ఎండీఎం ఆసుపత్రి వద్ద భారీ నిరసన చేపట్టారు. మార్వార్ రాజ్‌పుత్ సొసైటీ అధ్యక్షుడు హనుమాన్ సింగ్ ఖంగ్టా మాట్లాడుతూ.. పోలీసులే నిందితులను కాపాడుతున్నారని, వారి నిర్లక్ష్యం వల్లే ఇద్దరు యువతులు చనిపోయారని ఆరోపించారు. జోధ్‌పూర్ ఎస్పీ పీడీ నిత్య స్పందిస్తూ.. ప్రధాన నిందితుడు మహిపాల్‌తో పాటు మరొకరిని అదుపులోకి తీసుకున్నామని, మిగతా వారిని విచారిస్తున్నామని తెలిపారు. బాధ్యులైన అధికారులపై శాఖాపరమైన విచారణ జరుపుతామని హామీ ఇచ్చారు.

## కాబోయే భార్య అనుమానాస్పద మృతి..

# మృతదేహాన్ని పెళ్లాడిన వ్యక్తి

**న్యూఢిల్లీ ,మే 17 (నేటి దర్శిని)**
: ఒక వ్యక్తికి కాబోయే భార్య అనుమానాస్పదంగా మరణించింది. ఆ మహిళ తండ్రి ఫిర్యాదుపై పోలీసులు అతడ్ని అరెస్ట్ చేశారు. అయితే అంత్యక్రియలకు ముందు కాబోయే భార్య మృతదేహాన్ని ఆ వ్యక్తి పెళ్లాడాడు జార్ఖండ్‌లోని గిరిడిహ్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. మనీష్ ముర్ము అనే వ్యక్తికి నాలుగు నెలల కిందట ఒక యువతితో నిశ్చితార్థం జరిగింది. వారిద్దరికి పెళ్లి చేయాలని ఇరు కుటుంబాలు నిర్ణయించాయి. అయితే కాబోయే భార్యను మనీష్ తన ఇంటికి తీసుకొచ్చాడు. కొన్ని నెలలుగా ఆమెతో కలిసి సహజీవనం చేస్తున్నాడు. కాగా, మే 15న శుక్రవారం ఆ మహిళ ఆరోగ్యం క్షీణించినట్లు ఆమె తల్లిదండ్రులకు మనీష్ సమాచారం ఇచ్చాడు. దీంతో వారు అతడి ఇంటికి చేరుకున్నారు. ఆ మహిళను ప్రభుత్వ ఆసుపత్రికి



తరలించగా అప్పటికే ఆమె మరణించినట్లు డాక్టర్లు నిర్ధారించారు. ఈ సమాచారం తెలుసుకున్న పోలీసులు ఆసుపత్రికి చేరుకున్నారు. మహిళ మృతదేహాన్ని పోస్ట్‌మార్టం కోసం తరలించారు. అయితే మనీష్ తన కుమార్తెను బలవంతంగా అతడి ఇంట్లో ఉంచాడని, ఆమెను దారుణంగా కొట్టాడని, పెళ్లి చేసుకోవడం తప్పించుకునే ఉద్దేశంతో బలవంతంగా విషం తాగించాడని ఆ మహిళ తండ్రి ఆరోపించాడు. విష ప్రయోగం కారణంగానే తన కుమార్తె మరణించిందని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ నేపథ్యంలో మనీష్‌ను అరెస్ట్ చేశారు. మరోవైపు పోస్ట్‌మార్టం తర్వాత మహిళ మృతదేహాన్ని తీసుకునేందుకు ఇరు కుటుంబాలు నిరాకరించాయి. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో ఆమె మృతదేహాన్ని స్థానిక పోలీస్ స్టేషన్‌కు తరలించారు. శుక్రవారం రాత్రంతా అక్కడే ఉంచారు. అయితే శనివారం ఉదయం మహిళ మృతదేహాన్ని మనీష్ గ్రామానికి పోలీసులు తరలించారు. అతడి కుటుంబ సభ్యుల కోరిక మేరకు పోలీస్ భద్రత మధ్య అతడ్ని అక్కడకు తీసుకువచ్చారు. ఈ నేపథ్యంలో కాబోయే భార్య మృతదేహాన్ని మనీష్ పెళ్లాడాడు. ఆమె పాపిడిలో సింధూరం దిద్దటంతో పాటు ఇతర వివాహ సంప్రదాయాలను పూర్తి చేశాడు. ఆ తర్వాత ఆ మహిళ మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించారు. ఇరు కుటుంబాల మధ్య నెలకొన్న ఉద్రిక్తతల దృష్ట్యా పోలీసులను మోహరించారు.

# ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆకస్మిక తనిఖీ చేసిన కలెక్టర్



**ఉమ్మడి వరంగల్, మే 17 (నేటి దర్శిని బ్యూరో)**
ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతంగా పారదర్శకంగా నిర్వహించాలని జనగాం జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అధికారులను ఆదేశించారు. ఆదివారం ఉమ్మడి వరంగల్ జిల్లాలోని కొడకండ్ల, దేవరుప్పుల, పాలకుర్తి మండలాలలోని, వివిధ గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఎఫ్ ఏ క్యూ ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని, పెండింగ్ లో ఉన్న ఓ పి ఎం ఎస్ నమోదును త్వరగా పూర్తిచేయాలని ఆయన స్పష్టం చేశారు. మిల్లులకు ధాన్యం రవాణా నిరంతరాయంగా సాగేందుకు లారీలతో పాటు ట్రాక్టర్లను కూడా ఉపయోగించాలని అధికారులకు సూచించారు.

## విద్యాభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాధాన్యత: ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి




**ఉమ్మడి వరంగల్, మే 17 (నేటి దర్శిని బ్యూరో):**
రాష్ట్ర ప్రభుత్వం విద్య వైద్య రంగాల అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని వరంగల్ పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా హనుమకొండ ఐ డి ఓ సి సమావేశ మందిరంలో నిర్వహిస్తున్న విద్యా వారోత్సవాల ముగింపు కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. నియోజకవర్గ పరిధిలోని ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి రూపాయలు 200 కోట్లు కేటాయించి మౌలిక వసతులను మెరుగుపరిచినట్లు తెలిపారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో, పాటు క్రీడలు సాంస్కృతిక రంగాల్లోనూ నైపుణ్యాలు పెంపొందించేలా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా 2026 విద్యా సంవత్సరంలో రాష్ట్రస్థాయిలో 9వ స్థానాన్ని సాధించి విశిష్ట ఫలితాలు సాధించిన విద్యార్థులకు రూ.10 వేలు నగదు బహుమతిని అందించడంతోపాటు, తన సొంత వేతనం నుంచి అదనంగా రూ.10 వేల చొప్పున అందించి విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## కుంట్లూరులో ఘనంగా హిందూ సమ్మేళనం





**హయత్ నగర్, మే 17 (నేటి దర్శిని):**
కుంట్లూరు హిందూ సమ్మేళన నిర్వహణ సమితి ఆధ్వర్యంలో స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం సాయంత్రం హిందూ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గీతా విజన్ ప్రాజెక్టు సనాతన సింధు సత్సంగ్ ట్రస్ట్ వ్యవస్థాపకులు పూజ్య శ్రీ స్వామి సీత ప్రజ్ఞానంద సరస్వతి, విశ్వహిందూ పరిషత్ నాయకులు ఏడు దొడ్ల మల్లికార్జున రెడ్డి, మహిళా ఆర్ వాయిస్ జర్నలిస్టు నవత ముఖ్య అతిథులుగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హిందూ ధర్మ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, సమాజంలో ఐక్యతను పెంపొందించేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని పేర్కొన్నారు. యువత సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణలో ముందుండాలని సూచించారు. అనంతరం నిర్వాహకులు మాట్లాడుతూ హిందూ సమ్మేళన విజయానికి సహకరించిన ప్రముఖులు, స్థానిక ప్రజాప్రతినిధులు, దాతలు, స్పాన్సర్లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమం అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్య నిర్వహణ సమితి సభ్యుడు బద్దం హరీష్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సమ్మేళనం పండుగ వాతావరణంలో సాగింది. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, కార్యనిర్వాహక సమితి సభ్యులు, ప్రధాన కార్యదర్శులు, ఉపాధ్యక్షులు, సమన్వయకర్తలు, కోశాధికారులు పాల్గొన్నారు. చుట్టుపక్కల దాదాపు 40 కాలనీల నుంచి ప్రజలు భారీ సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. మహిళలు, యువకులు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు

# బ్రాహ్మణుల సంక్షేమం కోసం నిరంతరం కృషి

- బ్రాహ్మణ పరిషత్ చైర్మన్ బసవరాజు శ్రీనివాస్
- బ్రాహ్మణుల ఆత్మగౌరవం ఎక్కడ దెబ్బతిన్న పరిషత్ ముందు ఉంటుంది



**కొత్తపేట, మే17 (నేటి దర్శిని):**
రాష్టంలో బ్రాహ్మణుల సంక్షేమం కోసం బ్రహ్మణ పరిషత్ నిరంతరం కృషి చేస్తుందని తెలంగాణ బ్రాహ్మణ పరిషత్ చైర్మన్ బసవరాజు శ్రీనివాస్ అన్నారు. ఆదివారం కొత్తపేటలో న్యూమారుతినగర్ లోని బాగ్యనగర్ బ్రాహ్మణ సొసైటీ అధ్యక్ష ప్రధాన కార్యదర్శి వై. భవాని, వైష్ణవి ప్రసాద్ ఆధ్వర్యంలో శ్రీపాద తెలంగాణ బ్రాహ్మణ కోపరేటివ్ క్రెడిట్ సొసైటీ ఇష్టాగోష్టి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ బ్రాహ్మణ పరిషత్ చైర్మన్ బసవరాజు శ్రీనివాస్. వైస్ చైర్మన్ పొన్నాడ సుబ్రహ్మణ్య ప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పేద బ్రాహ్మణులకు ఆర్థిక, విద్యా. వైద్య సహాయాన్ని అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఆందరూ కలిసి కట్టుగా ఉండి తమకు రావలసిన సంక్షేమ పథకాలను సాధించుకోవాలని సూచించారు. ప్రభుత్వ సహకారంతో బ్రహ్మణుల ఆచివృద్ధి ఆనేక సంక్షేమ కార్యక్రమాలు రూపొందిస్తామని తెలిపారు. బ్రాహ్మణుల ఆత్మగౌరవం ఎక్కడ దెబ్బతిన్న బ్రాహ్మణ పరిషత్ ముందు ఉంటుందని తెలిపారు. ఆనేక



సంవత్సరాలు ఏపీలో విజయవంతం కొనసాగుతున్న బ్రాహ్మం క్రెడిట్ సొసైటీ పై అక్కడి వెళ్లి పూర్తి వివరాలు తెలుసుకొని మాన దగ్గర అమలు చేస్తామని తెలిపారు. తెలంగాణలో బ్రాహ్మణ క్రెడిట్ సొసైటీకి 100 కోట్ల నిధులు సమకూర్చే లక్ష్యంగా ముందుకు సాగుతాయని తెలిపారు. సొసైటికి నేను కూడా ఫండ్ ఇస్తానని తెలిపారు. రాష్టంలో ఉన్న సంఘాల సహకారంతో పరిషన్ను బలోపేతం దేవీ సంక్షేమం పథకాలు అందించడంతో చరిత్రలో నిలబడే విధంగా కృషి చేస్తామని తెలిపారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాలను తిరిగి బ్రాహ్మణ సమాజ ఉన్నతి, సంక్షేము పునర్నిర్మాణం కోసం నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. ఈ సందర్భంగా భాగ్యనగర్ బ్రాహ్మణ సొసైటీ ప్రధాన కార్యదర్శి పెండ్యాల శేషసాయి వర ప్రసాద్ ఆధ్వర్యంలో చైర్మన్, వైస్ వైస్ చైర్మన్ లను ఘనంగా సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో బ్రాహ్మణ సంఘం రాష్ట్ర నాయకులు తులసి శ్రీనివాస్, జనార్ధన్ మూర్తి . వక్కలంక శ్రీనివాస్. దుడ్డు సుబ్రహ్మణం, వారణాసి వంశీ. చైతన్యపురి మాజీ కార్పొరేటర్ రంగ నర్సింహగుప్త, పప్పు వెంకట్, కర్రా మూర్తి. ఆంజకేయులు, అబ్బుర్, పటేల్ తదితరులు పాల్గొన్నారు.బ్రాహ్మణ పరిషత్ చైర్మన్. వైస్ చైర్మన్లను సన్మానం చేస్తున్న వైష్ణవి ప్రసాద్ తదితరులు...

# కోడిరెక్క శౌరి అంతిమయాత్రలో పాల్గొన్న మంత్రి వివేక్ వెంకటస్వామి

- పాడె మోసి నివాళులర్పించిన మంత్రి వివేక్ వెంకటస్వామి, ప్రభుత్వ విప్ వేముల వీరేశం, ఎమ్మెల్యే బిఎల్ఆర్, ఎమెల్సీ శంకర్ నాయక్ , మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు తాళ్లపల్లి రవి, డాక్టర్ యేకుల రాజారావు
- 50 ఏళ్ల రాజకీయ, స్వచ్ఛంద సేవా ప్రస్థానానికి ముగింపు.
- అశ్రునయనాల మధ్య కోడిరెక్క శౌరి అంతిమయాత్ర
- మిర్యాలగూడలో ముగిసిన అంత్యక్రియలు



**మిర్యాలగూడ, మే 17 ( నేటి దర్శిని ):**
నిస్వార్థ రాజకీయాలకు, నిఖార్సైన ప్రజాసేవకు నిలువెత్తు నిదర్శనంగా నిలిచిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఎస్సీ సెల్ మాజీ రాష్ట్ర అధ్యక్షుడు కోడిరెక్క శౌరి అంత్యక్రియలు ఆదివారం మిర్యాలగూడ పట్టణంలో అశ్రునయనాల మధ్య అత్యంత అధికారిక వాతావరణంలో ముగిశాయి. గత శుక్రవారం అకస్మాత్తుగా బ్రెయిన్ స్ట్రోక్ (మెదడు రక్తపోటు)కు గురై ఆయన తుదిశ్వాస విడిచారు. ఆయన మరణవార్త విన్న తెలంగాణ రాజకీయ శ్రేణులు, బహుజన సమాజం దిగ్భ్రాంతికి లోనయ్యాయి. ఆదివారం ఉదయం స్థానిక నివాసం నుండి ప్రారంభమైన అంతిమయాత్ర పట్టణ పురవీధుల గుండా క్యాథలిక్ చర్చి వరకు సాగింది. చర్చిలో క్రైస్తవ మత పెద్దల ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించిన అనంతరం, అంతిమ ప్రార్థనలతో సాంప్రదాయ పద్ధతిలో సమాధి కార్యక్రమాన్ని పూర్తి చేశారు.

**అంతిమయాత్రలో మంత్రి వివేక్ వెంకటస్వామి: శౌరి పాడె మోసిన దృశ్యం**
కోడిరెక్క శౌరి మృతి సమాచారం అందుకున్న వెంటనే రాష్ట్ర గనులు, కార్మిక ,ఉపాధి కల్పన శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి మిర్యాలగూడకు చేరుకున్నారు. శౌరి భౌతికకాయాన్ని దర్శించి, పూలమాలలు వేసి భావోద్వేగభరితంగా నివాళులర్పించారు. శౌరి కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. అనంతరం ప్రారంభమైన అంతిమయాత్రలో మంత్రి



వివేక్ వెంకటస్వామి స్వయంగా పాల్గొని, శౌరి భౌతికకాయం ఉన్న పాడెను తన భుజాలపై మోశారు. అంతిమయాత్ర పొడవునా నడుస్తూ నివాళులర్పించిన మంత్రిని చూసి స్థానికులు, కాంగ్రెస్ శ్రేణులు భావోద్వేగానికి గురయ్యారు.

**కాకా వెంకటస్వామికి కుడిభుజం.. నిస్వార్థ సేవకుడు:**
ఈ సందర్భంగా మంత్రి వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ, కోడిరెక్క శౌరి మరణం తన కుటుంబానికి తీరని లోటని అన్నారు. తన తండ్రి, దివంగత ప్రముఖ జాతీయ నాయకుడు కాకా వెంకటస్వామికి శౌరి అత్యంత సన్నిహితుడిగా, కుడిభుజంగా వ్యవహరించారని గుర్తు చేసుకున్నారు. యువకుడిగా ఉన్న కాలం నుండే కాకా వెంకటస్వామి రాజకీయ, సామాజిక అడుగుజాడల్లో నడిచిన శౌరి, తెలంగాణలో దళిత, వెనుకబడిన వర్గాల హక్కుల కోసం నిరంతరం పోరాడారని కొనియాడారు.కాకా ఫౌండేషన్ స్థాపనలో శౌరి అగ్రభాగాన నిలిచారని, ఆ సంస్థ ద్వారా దశాబ్దాల పాటు ఎన్నో స్వచ్ఛంద సేవా కార్యక్రమాలను నిస్వార్థంగా నడిపించారని మంత్రి శ్లాఘించారు. ముఖ్యంగా పేద, నిరుపేద విద్యార్థులు ఆర్థిక ఇబ్బందుల వల్ల చదువుకు దూరం కాకూడదనే ఉద్దేశంతో అనేక రకాల చేయూతలు ఇచ్చి, వారి ఉన్నత విద్యాభ్యాసానికి మార్గం సుగమం చేశారని తెలిపారు. మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు తాళ్లపల్లి రవితో కలిసి మిర్యాలగూడ నియోజకవర్గంలో కాకా వెంకటస్వామి, బహుజన సిద్ధాంతకర్త కాన్షీరాం విగ్రహాలను ఒకే వేదికపై, ఒకేసారి ప్రతిష్టించి వారి ఆశయాల సాధన కోసం శౌరి శ్రమించిన తీరు చారిత్రాత్మకమని మంత్రి పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీకి కూడా ఆయన అందించిన రాజకీయ, ఆర్థిక మరియు నైతిక సహాయ సహకారాలు మరువలేనివని, 50 ఏళ్లుగా స్వచ్ఛంద సేవలో తరించిన నిజాయితీపరుడైన నాయకుడు శౌరి అని కొనియాడారు.

**తరలివచ్చిన ప్రముఖులు.. ఘన నివాళులు**
కోడిరెక్క శౌరి అంతిమయాత్రకు రాష్ట్రస్థాయి రాజకీయ నేతలు, బహుజన మేధావులు, ప్రజా ప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ప్రభుత్వ విప్ వేముల వీరేశం, మిర్యాలగూడ శాసనసభ్యుడు బత్తుల లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ శంకర్ నాయక్ లు శౌరి పార్థివ దేహానికి నివాళులర్పించి అంతిమయాత్రలో పాల్గొన్నారు.మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు తాళ్లపల్లి రవి, ప్రముఖ బహుజన మేధావి, అంబేద్కర్ వాది యేకుల రాజారావు, కాంగ్రెస్ పార్టీ నల్లగొండ జిల్లా అధ్యక్షుడు బొప్పన నగేష్ తదితరులు పాల్గొని, శౌరితో తమకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. శౌరి లాంటి నిబద్ధత కలిగిన నాయకుడిని కోల్పోవడం ఉమ్మడి నల్లగొండ జిల్లాకే కాకుండా, మొత్తం బహుజన ఉద్యమానికి పెద్ద నష్టమని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

**అశ్రునయనాలతో వీడ్కోలు పలికిన మిర్యాలగూడ**
ఈ కార్యక్రమం లో స్థానిక మున్సిపల్ చైర్మన్ సుధాకర్, వైస్ చైర్మన్ బడిపాటి శిరీష నవీన్, స్థానిక వార్డు కౌన్సిలర్ కోడిరెక్క ఇంద్ర కుమార్,
షెడ్యూల్ కులాల సంక్షేమ సంఘం ఉమ్మడి నల్గొండ జిల్లా అధ్యక్షులు మాడుగుల శ్రీనివాస్ లతో పాటు జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ ముల్లగిరి కాంతయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షులు సామరాజు, ప్రముఖ అంబేద్కర్ వాదులు డాక్టర్ జార్జి రాజు, యేకుల రాజారావు, మరియు కాంగ్రెస్ నాయకులు మాల మహానాడు జిల్లా నాయకులు యేకుల సురేష్, మేడ సైదులు, రెడ్డి మల్ల రవి, మరియు నియోజకవర్గంలోని వందలాది మంది కాంగ్రెస్ శ్రేణులు, దళిత సంఘాల కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు వారితోపాటు ప్రజాసంఘాల నాయకులు, దళిత, బహుజన ఐక్యవేదికల ప్రతినిధులు అంతిమ సంస్కారాలలో పాల్గొన్నారు. శౌరి చిట్టచివరి యాత్రను చూసేందుకు పట్టణ ప్రజలు, అభిమానులు రోడ్ల ఇరువైపులా నిలబడి పూలవర్షం కురిపించారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ మిర్యాలగూడ సమాజం అశ్రునయనాల మధ్య శౌరికి వీడ్కోలు పలికింది.

# ఇబ్రహీంపేటలో దారుణం..

## తల్లి కూతుళ్ల జంట హత్య కంట్లో కారం చల్లి తల్లి-కూతురిని హతమార్చిన కిరాతకులు

- భూ వివాదాలే కారణమా..?
- ఫామ్‌హౌస్‌లో మహిళల హత్య.. గ్రామంలో భయాందోళన

**అనుముల, మే 17 (నేటి దర్శిని):** నల్లగొండ జిల్లా అనుముల మండలం ఇబ్రహీంపేట గ్రామంలో ఆదివారం చోటుచేసుకున్న తల్లి--కూతుళ్ల జంట హత్యలు తీవ్ర కలకలం రేపాయి. గ్రామానికి చెందిన రుద్రాక్షి సుమలత (40), ఆమె కుమార్తె లావణ్య (20)లను గుర్తుతెలియని దుండగులు అత్యంత కిరాతకంగా హత్య చేసిన ఘటన స్థానికులను భయాందోళనలకు గురిచేసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సుమలత తన కుమార్తెతో కలిసి వ్యవసాయ భూమిని సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఆదివారం ఉదయం వారు ఇంటి బయటకు రాకపోవడంతో అనుమానం వచ్చిన స్థానికులు లోపలికి వెళ్లి చూడగా, ఇద్దరూ మృతదేహాలుగా కనిపించారు. వెంటనే అనుముల పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న పోలీసులు క్లూ టీంతో కలిసి ఘటనాస్థలానికి చేరుకుని పరిశీలించారు. ప్రాథమిక



దర్యాప్తులో హంతకులు ముందుగా మహిళల కంట్లో కారం చల్లి, అనంతరం గొంతు నులిమి హత్య చేసినట్లు గుర్తించారు. ఘటనాస్థలం నుంచి ఆధారాలు సేకరించిన పోలీసులు నిందితుల కోసం ప్రత్యేక




బృందాలతో గాలింపు చర్యలు చేపట్టారు. ఈ హత్యలకు భూ వివాదాలు, ఆస్తి తగాదాలే కారణమై ఉండొచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో భూముల విలువలు పెరుగుతున్న నేపథ్యంలో ఇలాంటి ఘర్షణలు పెరుగుతున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఘటన స్థలాన్ని మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖర్ రాజు సందర్శించి పరిస్థితిని సమీక్షించారు. ఆయనతో పాటు సీఐ శ్రీను నాయక్, హాలియా ఎస్సై సాయి ప్రశాంత్ పాల్గొన్నారు. నిందితులను త్వరలోనే పట్టుకుంటామని పోలీసులు తెలిపారు.

# రైతు పక్షపాతి ప్రధాని నరేంద్రమోడీ

- బిజెపి రాష్ట్ర నాయకులు చంద్ర జనార్ధన్ రెడ్డి



**మిడ్జిల్,మే 17, (నేటి దర్శిని మహబూబ్ నగర్ జిల్లా బ్యూరో ):** ప్రపంచ దేశాలు ఆర్థిక సంక్షోభంలో ఉన్నా దేశ ఆర్థిక పరిస్థితిని లెక్క చేయకుండా రైతు సంక్షేమమే లక్ష్యంగా కేంద్రంలోని ప్రధాని నరేంద్ర మోడీ రైతు పండించిన పంటలకు మద్దతు ధర పెంచి రైతు పక్షపాతిగా నిలిచారని బిజెపి రాష్ట్ర నాయకులు ముచ్చర్ల జనార్దన్ రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కేంద్ర కేబినెట్ లో మరోసారి పంటలకు మద్దతు ధర పెంచి నిర్ణయం తీసుకోవడం రైతుల పట్ల ఉన్న విధేయతకు నిదర్శనం అన్నారు.మద్దతు ధర పెంపుతో రైతులకు ఎంతోమేలు జరుగుతుందన్నారు.రైతు పండించిన పంట కు లాభదాయకమైన గిట్టుబాటు ధరను అందించడమే కాకుం డా రైతు ఆదాయ భద్రతను పటిష్టం చేస్తుందని అన్నారు. దేశ వ్యవసాయ రంగాన్ని మరింత బలోపేతం చేస్తుంద న్నారు.రైతు సంక్షేమానికి కేంద్ర కేబినెట్ తీసుకున్న నిర్ణయం చారిత్రాత్మకమని అన్నారు.కేంద్ర ప్రభుత్వానికి ప్రధాని నరేంద్రమోడీ కి కృతజ్ఞతలు తెలిపారు

# నూతన జంట బొప్పని రవి దివ్యా వాణిలను ఆశీర్వదించిన మంత్రి గడ్డం వివేక్ వెంకట స్వామి

- మంత్రితో పాటు ప్రభుత్వ చీఫ్ విప్ వేముల వీరేశం, ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి,
- ఎమ్మెల్సీ కేతావత్ శంకర్ నాయక్ కలిసి నూతన జంటను ఆశీర్వదించినారు వివాహానికి రాలేకపోయినందుకు ప్రత్యేకంగా విచ్చేసిన మంత్రి.
- మంత్రి గారి రాకతో భారీగా తరలివచ్చిన కాంగ్రెస్, దళిత సంఘాల నాయకులు, కార్యకర్తలు

**మిర్యాలగూడ/మాడుగులపల్లి, మార్చి 17 ( నేటి దర్శిని):** నల్గొండ జిల్లా మాల మహానాడు అధ్యక్షులు బొప్పని నగేష్ తమ్ముడి వివాహం ఇటీవల వైభవంగా జరిగిన విషయం విదితమే. అయితే వివాహ సమయాన ఉన్న అత్యవసర అధికారిక కార్యక్రమాలు, నిరంతర ప్రభుత్వ బిజీ షెడ్యూల్ కారణంగా రాష్ట్ర మంత్రివర్యులు గడ్డం వివేక్ వెంకటస్వామి ఆరోజు హాజరుకాలేకపోయారు. ఈ నేపథ్యంలో, ఇచ్చిన మాట ప్రకారం నూతన వధూవరులైన బొప్పని రవి కుమార్ , దివ్యా వాణి లను ఆశీర్వదించడానికి ఆదివారం నాడు మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి ప్రత్యేకంగా నల్గొండ జిల్లా మిర్యాలగూడ నియోజకవర్గం, మాడుగులపల్లి మండలం పరిధిలోని తోపుచర్ల గ్రామంలో గల వారి గృహానికి విచ్చేశారు. మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి తోపుచర్ల గ్రామానికి వస్తున్నారనే సమాచారం కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న కార్యకర్తలు, వివిధ దళిత సంఘాల నాయకులు, ఉమ్మడి జిల్లా అభిమానులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. మంత్రి గారికి ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమానికి మంత్రితో పాటు ప్రభుత్వ చీఫ్ విప్ వేముల వీరేశం, మిర్యాలగూడ



నియోజకవర్గ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ కేతావత్ శంకర్ నాయక్ లు వారి నివాసానికి చేరుకుని, ఇటీవల వివాహం చేసుకున్న నూతన వధూవరు బొప్పని రవి కుమార్ , దివ్యా వాణి ప్రభుత్వ టీచర్ లను ప్రత్యేకంగా కలిసి అభినందనలు తెలిపారు. నూతన దంపతులను శాలువాలతో ఘనంగా సత్కరించి, పుష్పగుచ్ఛాలు అందించి వారి వైవాహిక జీవితం నూరేళ్ల పాటు సుఖసంతోషాలతో, అన్యోన్యంగా సాగాలని మనస్ఫూర్తిగా ఆశీర్వదించారు. ఈ ఆశీర్వాద మహోత్సవ కార్యక్రమానికి మాల మహానాడు జాతీయ అధ్యక్షులు తాళ్లపల్లి రవి, జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ ముల్లగిరి కాంతయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షులు సామరాజు, ప్రముఖ అంబేద్కర్ వాదులు డాక్టర్ జాడీరాజు, యేకుల రాజారావు, మరియు మాల మహానాడు జిల్లా నాయకులు యేకుల సురేష్, మేడ సైదులులు హాజరై నూతన జంటకు పూలతో తమ శుభాకాంక్షలు అందజేశారు. అదేవిధంగా టీచర్ వల్లపుదాస్ సతీష్ కుమార్ లు విచ్చేసి వధూవరులను ఆశీర్వదించారు. ఈ వేడుకలో తోపుచర్ల కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు గౌని నిరంజన్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు డాక్టర్ శ్రీనివాస్ రెడ్డి, షెడ్యూల్ కులాల సంక్షేమ సంఘం ఉమ్మడి నల్గొండ జిల్లా అధ్యక్షులు మాడుగుల శ్రీనివాస్ లతో పాటు ముఖ్య నాయకులు అభినవ్, మీసాల నాగేందర్, రెడ్డిమల్ల రవి, కట్ట శ్రీనివాస్ రెడ్డి, అంజి, లక్ష్మయ్య, బొజ్జ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. వీరితో పాటు నియోజకవర్గంలోని వందలాది మంది కాంగ్రెస్ శ్రేణులు, దళిత సంఘాల కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు. వివాహ సమయాన రాలేకపోయినప్పటికీ, ప్రత్యేకంగా సమయం కేటాయించి తమ గ్రామానికి విచ్చేసి తమ్ముడి దంపతులను ఆశీర్వదించిన మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామికి, చీఫ్ విప్ వేముల వీరేశానికి, ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డికి, ఎమ్మెల్సీ శంకర్ నాయక్ కు మరియు తరలివచ్చిన కాంగ్రెస్, దళిత శ్రేణులకు, అభిమానులందరికీ మాల మహానాడు జిల్లా అధ్యక్షులు బొప్పని నగేష్ ఈ సందర్భంగా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు.

# అమ్మ ఫౌండేషన్ సేవలకు రాష్ట్రస్థాయి గుర్తింపు

- లీడ్ ఫౌండేషన్ వార్షికోత్సవంలో అమ్మ ఫౌండేషన్ ప్రతినిధులకు ఘన సన్మానం



**వీణవంక,మే17 (నేటి దర్శిని):** కరీంనగర్ జిల్లా వీణవంక మండలం మల్లారెడ్డిపల్లికి చెందిన అమ్మ ఫౌండేషన్‌కు అరుదైన గౌరవం లభించింది. గత రెండు సంవత్సరాలుగా గ్రామంలో వివిధ సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజలకు సేవలందిస్తున్న అమ్మ ఫౌండేషన్ సేవలను గుర్తించిన నర్సంపేటకు చెందిన లీడ్ ఫౌండేషన్ వారు ఘనంగా సత్కరించారు. ఆదివారం నాడు నిర్వహించిన లీడ్ ఫౌండేషన్ 20వ వార్షికోత్సవ కార్యక్రమంలో భాగంగా, అమ్మ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు గోనెల సమ్మన్న ముదిరాజ్‌తో పాటు సభ్యులు దరిపెల్లి మురళి (మామిడాలపల్లి)లను లోటస్ పబ్లిక్ స్కూల్, నర్సంపేటలో జరిగిన సభలో శాలువాలతో సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా గోనెల సమ్మన్న ముదిరాజ్ మాట్లాడుతూ, తమ సేవా కార్యక్రమాలను ప్రింట్ మీడియా, ఎలక్ట్రానిక్ మీడియా మరియు సోషల్ మీడియా ద్వారా గుర్తించి సత్కరించిన లీడ్ ఫౌండేషన్ యాజమాన్యానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో రెండు తెలుగు రాష్ట్రాల గ్రంథాలయ ఉద్యమకారుడు కందుకూరి రాము, కవి అన్వర్, ఎఫ్ఆర్‌వో రమేష్, చొల్లేటి కృష్ణమాచార్యులు, అరికెపూడి రఘు, అడ్వకేట్ శశిరేఖ, బండారి రఘు, గోక వినోద్, ఆవుల అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# సూర్య ప్రకాశ్ కి ఘన సన్మానం చేసిన కృష్ణ గోపాల్ సేవా సమితి





**హైదరాబాద్, మే 17(నేటి దర్శిని):** రిద్ధి సిద్ధి మహిళా మండలి, బేగంబజార్, హైదరాబాద్ ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక వాతావరణంలో శ్రీమద్భాగవత కథా కార్యక్రమం మే 18 నుండి మే 24 వరకు ఘనంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రతిరోజూ భక్తులకు ఆధ్యాత్మిక సందేశాలు, ధార్మిక బోధనలు అందించబడనున్నాయి. ఈ పుణ్య కార్యక్రమానికి కథా వక్తగా పరమ ఆదరణీయ సూర్య ప్రకాశ్ విచ్చేయనున్నారు. ఈ సందర్భంగా కృష్ణ గోపాల్ సేవా సమితి సమస్త పదాధికారులు సూర్య ప్రకాశ్ ని ఘనంగా సన్మానించి తమ గౌరవాన్ని తెలియజేశారు. భక్తి, సంస్కృతి, సనాతన ధర్మ పరిరక్షణకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని పలువురు అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో మహిళా మండలి సభ్యులు, సేవా సమితి ప్రతినిధులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# డ్రైనేజీ సమస్యపై వెంటనే స్పందించిన కౌన్సిలర్ అన్నపూర్ణ

- స్థానికుల ఫిర్యాదుతో డ్రైనేజీ క్లీన్ చేయించిన కౌన్సిలర్



**హాలియా మే17 (నేటి దర్శిని):** హాలియా మున్సిపాలిటీ పరిధిలోని 2వ వార్డులో పారిశుద్ధ్య సమస్యలను పరిష్కరించేందుకు స్థానిక కౌన్సిలర్ నకిరేకంటి అన్నపూర్ణ-సైదులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. వార్డులోని సుమంగళి ఫంక్షన్ హాల్ బజార్ ప్రాంతంలో రోడ్డు ఇరువైపులా పెరిగిన పిచ్చి మొక్కలు, పేరుకుపోయిన చెత్తాచెదారం, డ్రైనేజీలు జామ్ కావడంతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు కౌన్సిలర్ దృష్టికి తీసుకువచ్చారు. డ్రైనేజీలు సరిగా ప్రవహించక దుర్గంధ వాతావరణం ఏర్పడుతోందని స్థానికులు ఫిర్యాదు చేయడంతో కౌన్సిలర్ అన్నపూర్ణ వెంటనే స్పందించారు. మున్సిపల్ పారిశుద్ధ్య సిబ్బందితో కలిసి అక్కడి పరిస్థితులను పరిశీలించి, డ్రైనేజీల శుభ్రపరిచే పనులు, చెత్త తొలగింపు కార్యక్రమాలను దగ్గరుండి నిర్వహింపజేశారు. ఈ కార్యక్రమంలో స్థానికులు రేపాల సంతోష్, రాజు, వెంకన్న, శేఖర్, సాజిద్ తదితరులు పాల్గొన్నారు.

# ఎఫ్ సెట్ లో శ్రీ ఆకాష్ జూనియర్ కళాశాల విద్యార్థుల ప్రతిభ

**మిడ్జిల్, మే17, (నేటి దర్శిని మహబూబ్ నగర్ జిల్లా బ్యూరో):** శ్రీ ఆకాష్ జూనియర్ కళాశాల విద్యార్థులు ఆదివారం విడుదలైన ఎఫ్ సెట్ ఫలితాల్లో కే బిందు బైపీసీలో 826 ర్యాంకు, కే కీర్తన 3242 ర్యాంకు తో ప్రతిభ కనబరిచారు.ఎంపీసీ విభాగానికి చెందిన ఈ హర్షవర్ధన్ 4544వ ర్యాంకు సాధించగా, బైపీసీ విభాగంలో సి. గోపికృష్ణ 5427వ ర్యాంకు సాధించి సత్తా చాటారు. కళాశాల విద్యార్థులు మంచి ర్యాంకులు సాధించడం పట్ల అధ్యాపకులు పలువురు అభినందనలు తెలిపారు.




విద్యార్థుల కృషి ఉపాధ్యాయుల మార్గదర్శకత్వం తల్లిదండ్రుల ప్రోత్సాహంతో ఈ విజయం సాధ్యమైందని కళాశాల యాజమాన్యం పేర్కొంది. విద్యార్థుల విజయంపై తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి చేరుకొని కళాశాలకు మంచి పేరు తీసుకురావాలని

## బిజినెస్

## వీఐ లాభం 51,970 కోట్లు

**న్యూఢిల్లీ,**
టెలికాం సంస్థ వొడాఫోన్ ఐడియా ఎట్టకేలకు లాభాల్లోకి వచ్చింది. గడిచిన ఆర్థిక సంవత్సరం చివరి త్రైమాసికానికిగాను సంస్థ రూ.51,970 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభాన్ని గడించింది. లాభాలను ప్రకటించడం గత ఆరేండ్లలో ఇదే తొలిసారి.అంతక్రితం ఏడాది సంస్థ రూ.7,167 కోట్ల నష్టాన్ని నమోదు చేసుకున్నది. సమీక్షకాలంలో కంపెనీ కన్సాలిడేటెడ్ ఆదాయం 3 శాతం ఎగబాకి రూ.11,332 కోట్లకు చేరుకున్నాయి.

## అంతకంతకూ తగ్గుతున్న గోల్డ్, సిల్వర్ రేట్స్

ఇంటర్నెట్ డెస్క్
భారత్‌లో బంగారం, వెండి ధరలు అంతకంతకూ పతనం అవుతున్నాయి. రూపాయి మారకం విలువ పడిపోవడం, అంతర్జాతీయ అనిశ్చితులు, యూఎస్ డెట్ సెక్యూరిటీలపై రాబడులు పెరగడంతో బంగారం, వెండి ధరలు గత మూడు రోజులుగా తగ్గుతూనే ఉన్నాయి. రాబోయే రోజుల్లో ధరలు మరింత తగ్గే అవకాశం ఉందన్న అంచనాలు ఉన్నాయి. గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ ప్రకారం, (మే 17) ఉదయం 6.30 గంటల సమయంలో హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో 24 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర రూ.1,56,930గా ఉంది. 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,43,850ల వద్ద కొనసాగుతోంది. నగరంలో కిలో వెండి రూ.2.90 లక్షలకు చేరుకుంది.
ఇక చెన్నైలో ప్రస్తుతం 24 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర రూ.1,60,910ల వద్ద కొనసాగుతోంది. 22 క్యారెట్ల 10 గ్రాముల ఆర్నమెంటల్ బంగారం ధర రూ.1,47,500గా ఉంది. ముంబైలో 24 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర రూ.1,56,930గా, 22 క్యారెట్ల బంగారం ధర రూ. 1,43,850గా ఉంది. దేశరాజధాని న్యూఢిల్లీలో 24 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర రూ.1,57,080 పలుకుతోంది. 22 క్యారెట్ల ఆర్నమెంటల్ పసిడి ధర రూ.1,44,000గా ఉంది. దేశంలోని వివిధ నగరాల్లో కిలో వెండి ధర రూ.2.90–2.80 లక్షల మధ్య కదలాడుతోంది.



## సిగ్మాకు 107 కోట్ల ఆర్డర్

**హైదరాబాద్, మే**
సిగ్మా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ మరో భారీ ఆర్డర్‌ను దక్కించుకున్నది. ఉత్తర అమెరికాకు చెందిన కస్టమర్‌కు 11.4 మిలియన్ డాలర్ల(రూ.107 కోట్ల) విలువైన 90 వేల 155 ఎంఎం ఫిరంగి గుండ్లను సరఫరా చేయాల్సి ఉంటుందని పేర్కొన్నది.ఈ ఆర్డర్‌ను వచ్చే పది నెలల్లో పూర్తి చేయాల్సి ఉంటుందని, అంతర్జాతీయ డిఫెన్స్ తయారీ రంగంలో తనదైన ముద్ర వేయడానికి ఈ ఆర్డర్ ఎంతో కీలకమని కంపెనీ సీఈవో సునీల్ తెలిపారు.

## స్పోర్ట్స్

## శశాంక్ పోరాటం సరిపోలే..
## పంజాబ్‌పై విజయంతో ప్లే ఆఫ్స్‌లో ఆర్సీబీ..!

డిఫెండింగ్ ఛాంపియన్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ప్లే ఆఫ్స్‌కు దూసుకెళ్లింది. ధర్మశాలలో పంజాబ్ కింగ్స్(ూబఅయిఖఎ ఖఱఅస్త్రం)పై అదిరే విజయంతో నాకౌట్‌లో అడుగుపెట్టిన తొలి జట్టుగా అవతరించింది. వెంకటేశ్ అయ్యర్(73 నాటౌట్), విరాట్ కోహ్లీ(58)లు అర్ధ శతకాలతో ప్రత్యర్థి ముందు భారీ లక్ష్యాన్ని నిలిపిన బెంగళూరు రసిక్ దార్(3–36), భువనేశ్వర్(2–38) కృషితో 23 పరుగులతో గెలిచింది. శశాంక్ సింగ్(56) ఒంటరి పోరాటం చేసినా పంజాబ్‌కు వరసగా ఆరో ఓటమి తప్పించలేకపోయాడు.భారీ ఛేదనలో తొలి ఓవర్లోనే ప్రియాన్ష్ ఆర్య(0)ను ఔట్ చేసిన భువనేశ్వర్(2–38).. డేంజరస్ ప్రభ్‌సిమ్రన్ సింగ్(2)ను వెనక్కి పంపి పంజాబ్‌కు షాకిచ్చాడు. ప్రభ్‌సిమ్రన్ ఆడిన బంతిని స్లిప్‌లో పడిక్కల్ రెప్పపాటులో క్యాచ్ అందుకోగా పంజాబ్ 18వద్ద రెండో వికెట్ కోల్పోయింది. కూపర్ కొన్నొల్లీ(37), కెపట?న్ శ్రేయాస్ అయ్యర్(1)లు.. ఆదుకునే ప్రయత్నం చేయబోయారు. కానీ, రసిక్ దార్(3–36) సూపర్ డెలివరీతో అయ్యర్ వికెట్ కీపర్ జితేశ్ చేతికి దొరికాడు. పవర్ ప్లేలోనే కష్టాల్లో పడిన జట్టును సూర్యాన్ష్ షెడ్గే(35)తో కలిసి గెలిపించాలనుకున్న కూపర్ నాలుగో వికెట్‌గా వెనుదిరిగాడు. షెపర్డ్ ఓవర్లో పెద్ద షాట్ ఆడి బౌండరీ వద్ద బెథెల్ చేతికి చిక్కాడు.కాసేపటికే షెడ్గే ఔటవ్వగా..




ఇంప్యాక్ట్ సబ్ స్టోయినిస్(37), శశాంక్ సింగ్(56)లు దూకుడుగా ఆడారు. సుయాశ్ ఓవర్లో శశాంక్ మూడు సిక్సర్లతో 13 ఓవర్లకు స్కోర్ 120 దాటింది. కానీ, బెంగళూరు బౌలర్లు, ఫీల్డర్లు బౌండరీలు ఇవ్వలేదు. స్టోయినిస్‌ను హేజిల్‌వుడ్ ఎల్బీగా వెనక్కి పంపి పంజాబ్ ఆశలపై నీళ్లు చల్లాడు. చివరి ఓవర్లో 33 రన్స్ అవసరమవ్వగా రెండో బంతికి శశాంక్ ఔటయ్యాడు. అంతే ఆర్సీబీ 23 పరుగుల తేడాతో గెలిచి దర్జాగా ప్లే ఆఫ్స్ దూసుకెళ్లింది.

**కోహ్లీ, అయ్యర్ అర్ధశతకాలు**
ప్లే ఆఫ్స్‌కి అడుగు దూరంలో నిలిచిన రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు భారీ స్కోర్ కొట్టింది. పంజాబ్ కింగ్స్ బౌలర్లకు చుక్కలు చూపిస్తూ ధర్మశాలలో వెంకటేశ్ అయ్యర్(73 నాటౌట్), విరాట్ కోహ్లీ(58) అర్ధ శతకాలతో కదం తొక్కారు. పడిక్కల్(45)తో విరాట్ కీలక భాగస్వామ్యం నెలకొల్పగా.. ఆ తర్వాత అయ్యర్, టిమ్ డెవిడ్(28)లు ఉతికేశారు. దాంతో, పంజాబ్ ముందు కఠినమైన లక్ష్యాన్ని నిర్దేశించింది బెంగళూరు.

## సెలెక్టర్లు ఆలస్యం వద్దు..
## వైభవ్‌ను సీనియర్ జట్టులోకి తీసుకోండి..!



ఐపీఎల్‌లో స్టార్లు ఎందరున్నా విధ్వంసక ఆటతో బౌలర్లపై విరుచుకుపడుతున్న వైభవ్ సూర్యవంశీ 'సెంటర్ ఆఫ్ అట్రాక్షన్' గా నిలుస్తున్నాడు. తొలి బంతి నుంచే బాదడుకు తెరతీసే ఈ కుర్రాడిని భావి తారగా అభివర్ణిస్తున్నారు విశ్లేషకులు. అంతేనా.. వైభవ్‌ను భారత సీనియర్ జట్టులోకి తీసుకోవాలనే డిమాండ్లు పెరుగుతున్నాయి. పదిహేనేళ్లకే ప్రపంచ స్థాయి బౌలర్లను భయపెడుతున్న ఈ చిచ్చరపిడుగును ఆలస్యం చేయకుండా అంతర్జాతీయ మ్యాచుల్లో ఆడించాలని మాజీ కోచ్ రవి శాస్త్రి అభిప్రాయపడుతున్నాడు.పద్దెనిమిదో సీజన్‌లో ఐపీఎల్ అరంగేట్రం చేసిన వైభవ్ సూర్యవంశీ.. పంతొమ్మిదోలో తన పత్రాపాన్ని చూపిస్తున్నాడు. మంచినీళ్లు తాగినంత సులువగా సిక్సర్లు బాదుతూ.. రికార్డు శతకం కొట్టిన ఈ యంగ్‌స్టర్.. భారత జట్టు వైపు వడివడిగా అడుగులు వేస్తున్నాడు. ఏ జట్టులోకి వచ్చిన వైభవ్‌ను సీనియర్ జట్టులోనూ ఆడించాలని అంటున్నాడు రవి శాస్త్రి. స్పోర్ట్స్ ప్రజెంటర్ సంజనా గణేశన్‌తో శాస్త్రి మాట్లాడుతూ.. వైభవ్‌కు భారత జట్టు తలుపులు ముప్పావు వంతు తెరిచే ఉన్నాయని అన్నాడు.నేను మీకో విషయం చెబుతాను. ప్రతిభావంతుడైన వైభవ్ లాంటి వాళ్లను ప్రోత్సహించాలంటే వెంటనే అవకాశాలివ్వాలి. టీ20 ఫార్మాట్‌కు వైభవ్ ఏ విషయంలోనూ తీసిపోడు. ప్రస్తుతం భీకర ఫామ్‌లో ఉన్న అతడు ప్రపంచ క్రికెట్‌లో ఎన్నో శిఖరాలు అధిరోహిస్తాడు. అందుకు మనం అవకాశం ఇవ్వాలి. వైభవ్ 15 ఏళ్ల పిల్లాడు, అతడికి 16 ఏళ్లుంటాయి కాదు14 ఏళ్లున్నాయి అని చాలామంది మాట్లాడుతున్నారు. తనకంటే వయసులో రెండింతలు పెద్దవారైన బౌలర్లను అతడు ఎదుర్కొంటున్న తీరు చూడండి. అతడికి వయసు అనేది సమస్యే కాదు. నా ఉద్దేశంలో వైభవ్ ఎంతో సమర్థుడు. ఐర్లాండ్ పర్యటనకు ఎంపిక చేస్తే అతడు అద్భుతాలు చేస్తాడు. నేనైతే అతడిని గమనిస్తుంటాను' అని పేర్కొన్నాడు. ఐపీఎల్ అనంతరం శ్రీలంక గడ్డపై భారత ఏ జట్టు ముక్కోణపు సిరీస్ ఆడనుంది. జూన్ 26 నుంచి ఐర్లాండ్ పర్యటన మొదలవ్వనుంది. అయితే.. ఏ జట్టుకు ఎంపికైన వైభవ్‌ను ఐర్లాండ్ సిరీస్‌కు తీసుకుంటారా? లేదా? అనేది చూడాలి.

**236.56 స్ట్రయిక్ రేటుతో**
అండర్–19 ప్రపంచకప్ ఫైనల్లో ఇంగ్లండ్‌పై భారీ శతకం(175)తో టీమిండియాను గెలిపించిన వైభవ్.. ఐపీఎల్‌నూ దంచేస్తున్నాడు. ఓపెనర్‌గా రాజస్థాన్ రాయల్స్‌కు శుభారంభాలిస్తూ.. 11 ఇన్నింగ్స్‌ల్లో ఈ చిచ్చరపిడుగు 236.56 స్ట్రయిక్ రేటుతో 440 రన్స్ కొట్టేశాడు. సన్‌రైజర్స్‌పై కేవలం 36 బంతుల్లోనే శతకంతో ఐపీఎల్‌లో మూడో వేగవంతమైన సెంచరీ రికార్డు నెలకొల్పా డు.

## సాత్విక్ -- చిరాగ్ జోడీకి చుక్కెదురు..
## రన్నరప్‌గానే స్వదేశానికి..!

థాయ్‌లాండ్ ఓపెన్ ఫైనల్లో భారత డబుల్స్ ద్వయం సాత్విక్ సాయిరాజ్ -- చిరాగ్ శెట్టి కి చుక్కెదురైంది. సెమీస్‌లో సంచలన విజయంతో టైటిల్ పోరుకు దూసుకెళ్లిన ఈ జోడీకి లియో రాలీ కర్నాండో -- డానియెల్ మార్టిన్(ఇండోనేషియా) చెక్ పెట్టారు. ఆదివారం జరిగిన ఫైనల్లో గట్టిగా పోరాడినా భారత జంటకు ఓటమి తప్పలేదు. కెరీర్లో తొలిసారి వీరి చేతిలో సాత్విక్ చిరాగ్ జోడీ ఓటమి ఎదురైంది.థామస్ కప్‌లో కాంస్యంతో మెరిసిన సాత్విక్ సాయిరాజ్ -- చిరాగ్ శెట్టి ద్వయం థాయ్‌లాండ్ ఓపెన్‌లో టైటిల్ చేజార్చుకుంది. ఈ సీజన్‌లో తొలి ఫైనల్లో చెలరేగుతారనుకుంటే ఉసూరుమనిపించింది. సెమీఫైనల్లో మలేషియా షట్లర్లపై అదిరే విజయంతో టైటిల్‌పై ఆశలు రేపినా చివరకు రన్నరప్‌తో సరిపెట్టుకుంది. ఆదివారం జరిగిన ఫైనల్లో



ఇండోనేషియా జోడీ లియో రాలీ కర్నాండో -- డానియెల్ మార్టిన్ ధాటికి భారత జంట చేతులెత్తేసింది.తొలి సెట్‌ను మరీ దారుణంగా 12–21తో కోల్పోయిన సాత్విక్ -- చిరాగ్ రెండో సెట్‌లో గట్టిగానే ప్రతిఘటించారు. ప్రత్యర్థితో పోటీపడి పాయింట్లు సాధించారు. కానీ, మార్టిన్ జంప్ స్మాష్‌లతో విరుచుకుపడగా రెండు పాయింట్ల తేడాతో భారత ద్వయం కంగుతిన్నది. వరస సెట్లలో విజయంతో లియో -- డానియెల్ జోడీ టైటిల్‌ను తన్నుకుపోయింది.

# దేశాన్ని కుదిపేసిన 'హాథ్రస్' ఘటనపై డాక్యు-సిరీస్.. ట్రైలర్ విడుదల!




దేశవ్యాప్తంగా తీవ్ర సంచలనం సృష్టించిన హాథ్రస్ ఘటన ఆధారంగా రూపొందిన హిందీ డాక్యు-సిరీస్ 'హాథ్రస్' అధికారిక ట్రైలర్ ప్రముఖ ఓటీటీ వేదిక జీ5లో విడుదలైంది. సమాజంలో ఎంతో చర్చకు దారితీసిన ఈ వివాదమైన అంశాన్ని, దాని వెనుక ఉన్న నిజాలను, బాధితురాలికి జరిగిన అన్యాయాన్ని ఈ డాక్యు-సిరీస్ ద్వారా కళ్లకు కట్టినట్లు చూపించబోతున్నట్లు తెలుస్తుంది. 2020 సెప్టెంబరులో ఉత్తరప్రదేశ్‌లోని హాథ్రస్ జిల్లాలో జరిగిన అత్యంత అమానవీయమైన అత్యాచార ఉదంతం ఆధారంగా ఈ సిరీస్ తెరకెక్కింది. నాటి భయానక పరిస్థితులను, ఆ తర్వాత జరిగిన పరిణామాలను ఈ ట్రైలర్‌లో ఎంతో హృదయవిదారకంగా చూపించారు. వాస్తవ సంఘటనల ఆధారంగా ఎంతో నిజాయితీతో కూడిన పరిశోధనాత్మక శైలిలో రూపొందిన ఈ ప్రాజెక్ట్ ప్రస్తుతం వీక్షకులను ఎంతగానో ఆకట్టుకుంటోంది. యథార్థ గాథలను, ఇన్వెస్టిగేటివ్ కథనాలను ఇష్టపడే ప్రేక్షకులకు ఈ సిరీస్ ఒక సరికొత్త అనుభూతిని ఇస్తుందని మేకర్స్ పేర్కొంటున్నారు.ఈ కథనానికి నేపథ్యమైన హాథ్రస్ ఘోరం 2020 సెప్టెంబర్ 14న జరిగింది. హథ్రాస్ జిల్లాలోని ఒక గ్రామంలో 19 ఏళ్ల దళిత యువతిపై నలుగురు దుర్మార్గులు క్రూరంగా అత్యాచారం చేసి, శారీరకంగా తీవ్రంగా హింసించారు. నిందితుల దాడిలో వెన్నెముక విరిగిపోయి, నాలుకకు తీవ్ర గాయాలైన ఆ బాధితురాలు ఢిల్లీలోని ఆసుపత్రిలో ప్రాణాల కోసం పోరాడి సెప్టెంబర్ 29న కన్నుమూసింది. అయితే ఆ తర్వాత బాధితురాలి మృతదేహాన్ని అర్ధరాత్రి వేళ కుటుంబ సభ్యుల అనుమతి లేకుండా, వారిని గదిలో బంధించి పోలీసులే బలవంతంగా అంత్యక్రియలు నిర్వహించడం దేశవ్యాప్తంగా తీవ్ర ఆగ్రహానికి, నిరసనలకు దారితీసింది. ప్రజల నుంచి పెద్ద ఎత్తున ఒత్తిడి రావడంతో ఈ కేసు విచారణను ప్రభుత్వం సీబీఐకి అప్పగించింది. ఆ తర్వాత ప్రత్యేక కోర్టు ఈ కేసులో ప్రధాన నిందితుడికి యావజ్జీవ కారాగార శిక్ష విధించగా, మిగిలిన ముగ్గురిని ఆధారాలు లేకపోవడంతో విడుదల చేసింది. భారతదేశంలో మహిళల భద్రత, కుల వివక్ష మరియు పోలీసుల వైఫల్యాలపై తీవ్రమైన చర్చను లేవనెత్తిన ఈ దురదృష్టకర సంఘటనకు సంబంధించిన పూర్తి నిజాలను నిశ్శితంగా విశ్లేషిస్తూ రూపొందించిన ఈ సంచలనాత్మక డాక్యు-సిరీస్ ప్రస్తుతం జీ5 ఓటీటీ వేదికగా స్ట్రీమింగ్ అవుతోంది.



రాశీఖన్నా హాట్ షో..


# ఆ సినిమాలో అస్సలు నటించను..

## రూ.12కోట్లు ఇస్తానన్నా నో చూపిన త్రిష.. అసలు కారణం ఇదేనా



సినిమా ఇండస్ట్రీలో సక్సెస్ ఫుల్ హీరోయిన్ గా రాణిస్తున్నారు నటి త్రిష. నాలుగు పదుల వయసులో కుర్ర హీరోయిన్స్ కు పోటీ ఇస్తూ తన అందంతో కుర్రకారును కట్టిపడేస్తున్నారు త్రిష. రీసెంట్ గా కరుప్పు సినిమాతో హిట్ అందుకున్నారు త్రిష. సూర్య హీరోగా నటించిన ఈ సినిమా ఇటీవలే ప్రేక్షకుల ముందుకు వచ్చింది. తమిళ్ తో పాటు తెలుగులోనూ సినిమాలు చేస్తూ హిట్స్ అందుకుంటుంది త్రిష. మెగాస్టార్ చిరంజీవి నటిస్తున్న విశ్వంభర సినిమాలో త్రిష హీరోయిన్ గా నటిస్తుంది. ఈ సినిమా త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇదిలా ఉంటే త్రిషకు ఓ భారీ ఆఫర్ వచ్చినట్టు తెలుస్తుంది. అంతే కాదు ఆ సినిమా కోసం ఏకంగా 12కోట్లు కూడా ఆఫర్ చేశారట. కానీ త్రిష మాత్రం ఆ సినిమా ఆఫర్ ను రిజెక్ట్ చేసిందని టాక్ వినిపిస్తుంది. పైగా ఆ సినిమాలో ఇద్దరు బడా హీరోలు ఇంతకూ త్రిష ఎందుకు ఆ సినిమాను రిజెక్ట్ చేసింది. అసలు కారణం ఏంటి అనేది ఇప్పుడు ఇండస్ట్రీలో హాట్ టాపిక్ గా మారింది. అసలు మ్యాటర్ ఏంటంటే.. సూపర్ స్టార్ రజినీకాంత్, కమల్ హాసన్ కలిసి సినిమా చేస్తున్న విషయం తెలిసిందే.. ఈ సినిమాకు స్టార్ డైరెక్టర్ నెల్సన్ దిలీప్ దర్శకత్వం వహిస్తున్నారు. ఇటీవలే ఈ సినిమా నుంచి గ్లింప్స్ కూడా విడుదల చేశారు. ఈ సినిమాలో హీరోయిన్ గా త్రిషను సంప్రదించారట.అయితే ఆ ఆఫర్ కు త్రిష నో చెప్పారని తెలుస్తుంది. అంతే కాదు సినిమాకోసం ఏకంగా రూ. 12 కోట్లు రెమ్యునరేషన్ ఆఫర్ చేశారట.. అయినా కూడా త్రిష ఈ సినిమాను చేయడానికి అంగీకరించలేదని తెలుస్తుంది. ఈ భారీ ఈ సినిమాను ఉదయనిధి స్టాలిన్‌కు చెందిన రెడ్‌జెయింట్ నిర్మాణసంస్థ తెరకెక్కించడంతో త్రిష ఈ సినిమా ఆఫర్ ను రిజెక్ట్ చేసిందని ఇంగ్లీష్ మీడియా తెలిపింది.. అయితే త్రిష నో చెప్పడానికి అసలు రీజన్ ఇదేనా అని అభిమానుల్లో డౌట్స్ మొదలయ్యాయి. కాగా విజయ్ ఇటీవలే తమిళనాడు సీఎంగా పదవీబాధ్యతలు స్వీకరించారు. కాగా ఈ ఎన్నికల్లో త్రిష పేరు కాస్త గట్టిగా వినిపించిన విషయం తెలిసిందే..

# 'ధురంధర్: ది రివెంజ్' నుంచి 'వారిజవాన్' ఫుల్ వీడియో సాంగ్ విడుదల!




బాలీవుడ్ స్టార్ హీరో రణవీర్ సింగ్ ప్రధాన పాత్రలో దర్శకుడు ఆదిత్య ధర్ తెరకెక్కించిన బ్లాక్ బస్టర్ చిత్రం 'ధురందర్: ది రివెంజ్'. థియేటర్‌లలో సూపర్ హిట్ అందుకున్న ఈ చిత్రం తాజాగా ఓటీటీలలో కూడా అడుగుపెట్టింది. అయితే ఈ సినిమా ఒకవైపు ఓటీటీలలో సెన్సేషన్ సృష్టిస్తుండగా, తాజాగా ఈ సినిమాలోని మోస్ట్ అవేటెడ్ సాంగ్ 'వారిజవాన్' 8K ఫుల్ వీడియో సాంగ్‌ను మేకర్స్ విడుదల చేశారు.ఈ చిత్రానికి శషాస్వత్ సచ్‌దేవ్ అదిరిపోయే సంగీతాన్ని అందించారు. పంజాబీ మరియు ఇంటెన్స్ ఎలక్ట్రానిక్ డాన్స్ మ్యూజిక్ ఫ్యూజన్‌తో కూడిన ఈ ఎనర్జిటిక్ ట్రాక్‌ను జ్యోతి నూరన్, రెబెల్ తమ పవర్‌ఫుల్ వాయిస్‌తో అద్భుతంగా ఆలపించారు. ఈ పాటకు జాస్మిన్ శాండ్లాస్, రెబెల్ క్యాచీ లిరిక్స్ అందించారు. తాజాగా విడుదలైన ఈ 8ఖ అల్ట్రా హెచ్‌డీ వీడియో సాంగ్‌లో రణవీర్ సింగ్ స్క్రీన్ ప్రెజెన్స్, అదిరిపోయే మాస్ వైబ్స్ మరియు ఎనర్జీ ప్రేక్షకులను, అభిమానులను ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి. జియో స్టూడియోస్ మరియు బి62 స్టూడియోస్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ భారీ యాక్షన్ చిత్రంలో రణవీర్ సింగ్‌తో పాటు సంజయ్ దత్, ఆర్. మాధవన్, అర్జున్ రాంపాల్, సారా అర్జున్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు.

# రజినీకాంత్ జైలర్ 2లో గెస్ట్ రోల్స్ లో ఎవరెవరు కనిపించబోతున్నారంటే..?



సూపర్ స్టార్ రజినీకాంత్ క్రేజీ లైనప్‌లో ఒకటి జైలర్ సీక్వెల్ జైలర్ 2. కోలీవుడ్ డైరెక్టర్ నెల్సన్ దిలీప్‌కుమార్ డైరెక్ట్ చేస్తున్న ఈ మూవీలో తలైవా టైటిల్ రోల్‌లో నటిస్తున్నాడని తెలిసిందే. సీక్వెల్‌కు సంబంధించిన ఆసక్తికర వార్త ఇప్పుడు మూవీ లవర్స్‌ను ఖుషీ చేస్తోంది.జైలర్ 2లో ముత్తువేల్ పాండ్యన్ (తలైవా పాత్ర పేరు) మరింత పవర్ ఫుల్ రోల్‌లో చూపించబోతున్నాడట. నెల్సన్ దిలీప్ కుమార్ మైండ్ బ్లోయింగ్ స్క్రీన్ ప్లే ఐడియా ప్రేక్షకులను సర్‌ప్రైజ్ చేయనుందని ఇన్‌సైడ్ టాక్. ఫస్ట్ పార్ట్ ముత్తువేల్ పాండ్యన్ పదవీ విరమణకు ముందు జీవితాన్ని చూపించే ప్రీక్వెల్‌గా ఉండనుండగా.. సెకండాఫ్ పూర్తి స్థాయి సీక్వెల్‌గా రానుందట. జైలర్ 2లో పాపులర్ డైరెక్టర్ కమ్ యాక్టర్ ఎస్ జే సూర్య విలన్‌గా కనిపించబోతున్నాడని సమాచారం. గెస్ట్ అప్పీరియన్స్ రోల్స్‌లో మోహన్ లాల్, విజయ్ సేతుపతి, శివరాజ్ కుమార్ కనిపించనున్నారని టాక్. ఫస్ట్ పార్టులో విలన్‌గా కనిపించి బాక్సాఫీస్‌ను షేక్ చేసిన వినాయకన్ ఫ్లాష్ బ్యాక్ ఎపిసోడ్‌లో కనిపించనున్నాడట. ఇక అనిరుధ్ రవిచందర్ అదిరిపోయే మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్‌తో మాస్ ఫీస్ట్‌లా జైలర్ 2 ఉండబోతుందన్న వార్తలు ఇప్పుడు అభిమానులు, మూవీ లవర్స్‌లో జోష్ నింపుతున్నాయి. తాజా టాక్ ప్రకారం సెప్టెంబర్ 4 నుంచి జైలర్ 2 వేట మొదలు కానుంది.

Published and Owned By Katta Hima Pavani Published at H.No:4-8-301/34SP, Sathya Nagar Colony, Hayath Nagar, Ranga Reddy, Telangana-501505. Printed at Smilys Online 6-7-48, Vanasthalipuram Shopping Complex, Ranga Reddy District, Telangana-500070, Editor: Katta Hima Pavani, PRGI NO: TGTEL/25/A0471, Phone: 94920 33365